ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక.

సంపుటి 32 వృషభనామ సంవత్సరము - శ్రావణ-కార్తీకములు - సంచిక 3-

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము ౩౨. { స్వభాను శ్రావణ—కార్తికములు. } సంచిక ౩-౪

సంస్కృతబసవోదాహరణము.

పాల్కురికి సోమనాథకవి ప్రణీతము. (క్రీ. శ. 1220 ప్రాంతము.)

ప్రథమావిభక్తిః.

మాలిని. జయతు బసవరాజః ప్రాణలింగాత్మపూజః
శరణదివిజభూజః స్మేరసంవిత్సరోజః
[1]గణపరిషదధీనః ఖ్యాతదానావ[2]ధానః
సరసమహిమగానః స్వానుభూత్యైకమానః

కళిక - హరిగతిరగడ.

అపిచ పురాతననూతన శివగణపాదోదకపరిలసదభిషేకః
కుపితవికల్పవ కల్పవ జంగమ లింగసమర్చన నిచితవివేకః
సతతవికస్వరభాస్వరనిజముఖమండల ఖండితరజనీనాథః
కృతయుగవర్తన కీర్తన రసన నిపుణపవిత్రచరిత్రసనాథః
ప్రకటితదర్పకదర్పకరేణుప్రమథననిశితకరాంకుశహేళః
శుకముఖమానస మానసకమలాకరవిహరణ చణరాజమరాళః
స్వానుభవాంచిత కూడలి సంగమ సంగతిదేవధ్యానాభిజ్ఞః
సూనృతభాషణభూషణ వాణీ సింహాసనగంభీరరసజ్ఞః

1. గర. 2. దాన.

ఉత్కలిక.

కావుళనారాట ధ్వనిసార   శ్రుతిమఖర స్వర సరస సమేత
శ్రీవిశ్రుతపేశల శారీర   సంస్కృతినికురుంబరసాయనగీత
వ్యతికర నానాగతి నిస్సీమ   క్రమమిళితహృద్వర్తన శితికంఠః
శ్రుతిసంధాయి చమత్కృతభూమ   శమదమలాలన గుణితోత్కంఠః.

ద్వితీయా విభక్తిః.

శా. వేదాంతార్థరహస్యభేదకిశున వ్యాపారపారంగత
ప్రౌఢప్రక్రియ వాక్ప్రపంచ రచనాచాతుర్యధుర్యాశయమ్
దైవాస్తిక్యనిదర్శనప్రతిభువమ్ తాపచ్ఛిదాపండితమ్
భాండాగారధురీణమత్ర బసవామాత్యం కిమాచక్ష్మహే.

కలిక - ద్విరదగతిరగడ

ఆపిచ కరతలయుగళ విహితపురహరయజన
మవహితకరణసతత పరిముదితశరణజన
మహిమకర శశిసరణి విముఖనిజపవనగతి
మహిపరిమ దధిపక్షభ వివిధమధురిమసుమతి
మతులకరిహారి కనకమణిగణగుణితవిభవ
మతివిమమ బహుళతరభవజలధికలశభవ
మమల నిజహృదయ కృతపరిచయవిదనుభవమ్
శమితనిరవధికకలివృజినసహచరభవమ్

ఉత్కలిక.

నిరతిశయ జనదురిత   సకల యమిజన విమల
నిరసన నిపుణచరిత   [1]వికసితహృదయ కమల
ఘనవిషయ రసవిముఖ   పరికలన మధుకరం
సనక శుకజనకముఖ   శరణజన శివకరం

1. వికలిత.

తృతీయావిభక్తిః.

శా. ఆస్థానే శివనాగసంయమి కరద్వంద్వాంగుళిశ్రేణికా
లీలాలాలన మంథనా దజనయత్ యః క్షీరధారావళిం
తే నాత్యద్భుతకర్మకర్మఠ మహామాహాత్మ్యవర్ధిష్ణునా
భాండాగారధురంధరేణ బసవామాత్యేన కః స్పర్ధతే.

కళిక - తురగవల్గనరగడ.

అపిచనిగమసారభూతవీరశైవదీక్షితేన
తపనశత సహస్రసదృశ దేహదీప్తిలక్షితేన
ఖండిత ప్రసూనవిశిఖచాపదండలస్తకేన
మండితానుభావశరణచరణకలితమస్తకేన
విదళితప్రచండ వివిధ విషమ విషయగర్జితేన
హృదయవివర [1] నివసత్ప్రగాఢ లౌల్యవర్జితేన
నీలగళవిశిష్ట భక్తభవన పుష్యదిందిరేణ
ఫాలనయన విమలహృదయ కమలమధ్యమందిరేణ

ఉత్కలిక.

యావనాళరాశినిహిత సాంగ భక్తవృషభనిత్య
భావినుత కటాక్షమహిత రంగ వల్లినియమకృత్య
శక్తివైభవాభి జాత దృష్టసాద్భుత క్రమేణ
మౌక్తిక ప్రదానసీత దుష్టదళన విక్రమేణ.

చతుర్థీవిభక్తిః.

శా. వేదాంతోదిత వీరశైవసమయాచార ప్రవృత్తప్రక్రియా
చర్యాదేశిక సార్వభౌమ మహిమభ్రాజిష్ణవే జిష్ణవే
భాండాగారధురంధరాయ బసవామాత్యాయ చేతస్సదా
జాగ్రత్కూడలి సంగమేశ్వరమహాదేవాయ తస్మైనమః.

---

1. శివసత్ప్ర.

కళిక - హరిగతిరగడ.

అపిచగౌతమ కణాదకుంభజచ్యవనముఖ్య [1] ముని (లబ్ధ) పద్మనే
తపనవహ్నిహిమభానులోచన త్రిపురవైరిగణభావితాత్మనే
కరతలస్థ నిఖిలాండమండలి [2] ప్రకటకందుక సదావిహారిణే
కరటిదైత్యఘనతుంగ మస్తకస్ఫురితమౌక్తిక నికాయహారిణే
కుసుమబాణశితబాణ [3] సంహతిగ్రసనధీర గుణపారశోచిషే.
వసుమతీప్రముఖ భూతచేతన [4] ప్రదదయామయ కటాక్షరోచిషే.
వితతపాతక సమూహసానుమద్వితతి నిర్దళనవజ్రబాహవే
శ్రుతిసముత్కర సదావిరోధ కృత్క్రమయ బౌద్ధముఖచంద్రరాహవే.

ఉత్కలిక.

రుచిరరత్న మహాసిహాటక
ప్రమర [5] రూప జనసత్వ ఘోటక
త్వరితధూత సృణి పాలధారణ
శీత దాన జలగంధవారణ
[6] ప్రథితవస్తు పరిమన్నిరంతర
ప్రదమహా మహిమకారణాంతర
స్మితపరిస్ఫురిత భక్తచేతసే
స్తుతివచోముదిత వహ్నిరేతసే.

పంచమీవిభక్తిః.

శా. చేతః కీలితసంగమేశ్వర మహాదేవాలికప్రస్ఫుర
జ్జ్వాలా జాలజటాల వహ్నిశిలభాకారప్రసూనాంబకాత్
భాండాగార ధురంధరాద్బసవ నామాత్యా [7] (త్సుపర్వావళీ)
చూడాఘృష్ట పదారవింద యుగళాన్నైవాపరం దైవతమ్.

కళిక - హరిగతిరగడ.

అపిచజగత్త్రయ కర్ణసుధారస కల్యాంచితసూనృతజల్పాకాత్
కుపితాంతర్గత రిపు [8] షడ్వర్గమహోత్కట మస్తకతట కుట్టాకాత్

---

1. మూర్తి. 2. లిక్కనక కందుకవద్విహారిణే. 3. సంహృతి. 4. చేతనా యుత. 5. ప్రభయ 6. ప్రథమశాంభవాంత కరణాంతర. 7. (మాత్య...వళీ) క. 8. షడ్వర్గాప (ను) ంఠర.

పరవనితాజన భాసురతర ముఖమండలవీక్షణ విధి జాత్యంధాత్
నిరతిశయానుగ్రహాశిత ఖడ్గలతాపాలీలూన పునర్భవబంధాత్
కన్నడబ్రహ్మయ కరుణాసుధార్ణవసంవర్ధన రాకాచంద్రాత్
కిన్నరబ్రహ్మయ పురహరగోష్ఠీసల్లపనాకర్ణన నిస్తంద్రాత్
లాలిత సకలపురాతన గణహాబ్మణిముకురప్రతి బింబితరూపాత్
లీలాలాలస రసమణి చంచలనయనాంచల శితవిశిఖదురాపాత్.

ఉత్కళిక.

ఆశాజల సుతశిఖరి సమూహా   వ్యాధి కలిమదుత్తుంగతరంగ
క్లేశతిమింగిల మిత్రగ్రాహా   క్రోధవిజృంభణ ఘోరభుజంగ
స్వకళత్రసముత్కరసవఫేన   స్ఫారదురుతరభవజలధివహిత్రాత్
ప్రకటితబాంధవ మండలమీన   దురిత లతాచయలవనలవిత్రాత్.

షష్ఠీవిభక్తిః.

శా. చిద్వ్యోమ స్మయమాన శీతకిరణోద్యోతత్సుధామాధురీ
నిర్వృత్తిస్నపనప్రమోద భరిత శ్రీ నీలకంఠాత్మనః
ఉన్మీల ద్గుణరత్నరోహణ మహాశైలస్య తస్య ప్రభోః
భాండాగార ధురంధరస్య బసవామాత్యస్యదాస్యంభజే.

కళిక హంసగతిరగడ.

అపిచశరనీహార హారమలయజభసిత సితదివ్యదేహస్య
కుపథచరదుర్భావ భావభవమదవిహృతిహృదిసుసన్నాహస్య
సంగమేశ్వర నిహిత హితమధుర సంగీతగీతానుభావస్య
జంగమ మనస్సంగ సంగతేహాదావ దావప్రభావస్య
[1]భక్తిమహిళాశ్లేష జనితమేదుర విపులపులకసంయోగస్య
ముక్తిసౌఖ్యాధాన దానవిద్యానిరత రతమహోద్యోగస్య

1. శాకేందబోద (భాభిస)

పరిచిత సుధాసార సారమధురిమనిష్కృతి కృతిచణ వచస్కస్య
ధరణీ దిగ్వియదతల తలఃబిడ శశికరనికరనిభయశస్కస్య.

ఉత్కళిక - ద్విరదగతి.

నిటలలోచన భక్తవాత్సల్య కల్యాణ
కటక సీతావాస నిస్సీమ కల్యాణ
గోచరాంచితవపుర్విస్ఫూర్తిమడివాల
మాచయప్రభు దీర్ఘనయనాంచితోత్కళ
కోపప్రసాద (భాజన)తా విధాక్రాంత
దీపిత ప్రథమానభక్తి వినయాత్యంత
భారవైదిక సుప్రసుత శివాచారస్య
సారజంగమహాస్తిమణి కర్ణపూరస్య.

సప్తవిభావిభక్తిః.

శా. ఓంకారాంకురి వేదపల్లవలసచ్ఛ్రంచాశరీమంజరీ
తత్త్వామోద నితాంతలబ్ధశరణా [1] సీకేర్ధ పుష్పంధయా
యాసౌ నాదలతా తదీయసు [2] పమా రామాభిరామస్థలే
తస్మిన్ శ్రీ బసవాహ్వయే గుణనిధౌ కింవా సలోకోత్తరం.

కళిక - మధురగతిరగడ.

అపిచాధార సురంగ జ్ఞాతరి
సుపథపథిక చిత్సుఖసంధాతరి
వర్గచతుష్టయ దాపన శీలిని
దుర్గతి నిరసన కరుణాశాలిని
శరణపదాబ్జ పరాగలలామని
దురితనిరాస ధురంధర ధామని
వేదవిరుద్ధాచార పరిద్విషి
నాదసుధా ప్రీణిత పురవిద్విషి.

---

1. సీకోర్ధ. 2. ష్పవా.

ఉత్కలిక

సురగిరి మందర మహిళా సహచర
నిరుపమ కందర విహారత ఖేచర
ఘనతర చందన లాలిత నామని
వనచయనందన కీలిత ధామని

సంబోధనవిభక్తిః.

శా. మూలాధార వికస్వరాంబుజవనీమధ్యస్ఫురద్వీచికా
యాతాయాత వినోదపేశలమతే! చిద్వ్యోమశీతద్యుతే!
సంసారార్ణవ కర్ణధార! కృపయా మాం పాలయ ప్రత్యహం
భాండాగారధురంధరేశ! బసవామాత్యేశ చూడామణే.

కళిక - ద్విరదగతి.

అవిచపాలిత వీరశైవవ్రతాచార
కృపణజనరక్షణ కృతచరణవ్యాపార
సితయశఃకర్పూరవాసితబ్రహ్మాండ
ఖఃతిరహితకిల్బిషాంబుజషండవేదండ
భుజగవరసుర గరుడ ఖచర కిన్నరసాధ్య
నిజగుణశ్రవణతోషిత వందితారాధ్య
శతమఖతరుస్ఫీత గణవేషనుత్కంఠ
తతవితతఘన సుషిరకీర్తితశ్రీకంఠ.

ఉత్కలిక.

శుకముఖ మనోగమ్య సాధిత స్వాత్మావ
వికచగుణ గణతామ్య బోధ నిజసద్భావ
దల్లమప్రభు సత్య శివతత్త్వ విస్తార
సల్లపన సాంగత్య భక్తికథనిస్తార.

సార్వవిభక్తికమ్.

శా. యస్సంగీత నిధిః యమాహురభవం యేనార్చితమ్ సూనృతమ్
యస్మై స్వస్తి యతస్తదీయమి దభాత్ యద్వీరశైవ వ్రతం
యస్యాపాంగసహోదరీవ కరుణా యస్మిన్మహత్త్వాధికం
సర్వం త్రీణి జగంతి పాహి బసవామాత్యేశ చూడామణే!

ఆర్యా. శ్రీ బసవరాజ గుణమణి
ఖచితం జయతాత్ సువర్ణమీరత్
సోమసుకవినా రచితం
హృదయాభరణం సదాముదాహరణమ్.

ఈ సంస్కృత బసవోదాహరణము పాల్కురికి సోమనాథకవి రచిత గ్రంథములలో నముద్రితములై నిలిచినవానిలో నొకటి. సోమనాథుఁడు సంస్కృతమునను దెలుఁగునను నొక్కొక యుదాహరణము రచించినాఁడు. తెలుఁగు[1] బసవోదాహరణ మిదివఱకు ముద్రితము. సంస్కృతోదాహరణ ముద్రణమున కిదియే ప్రథమము. చెన్నపురి ప్రాచ్యలిఖితభాండారమునందలి మాతృక ననుసరించినప్రతిక యాధారముగా దీనిఁ బ్రకటించితిమి. ఇందు పెక్కు లేఖక ప్రమాదములు కలవు. మాకుఁ జేరినవ్రాఁత ప్రతియందును బెక్కు దోషములు కలవు. ప్రత్యంతరము కొఱకుఁ బ్రయత్నించుచున్నారము.

సంస్కృతమున నుదాహరణము లతిప్రాచీనకాలమునుండి యున్నట్లు దెలియవచ్చినను మనకు లభించినవి రెండు మూఁడని మాత్రమే చెప్పనగును. [2]వానిలో నిది ప్రాచీనము. సంస్కృతమున నున్నను, తెలుఁగున గల యుదాహరణలక్షణములు కలిగియుండుటచేతను, తెలుఁగుకవియగు సోమనాథుని కృతియగుటచేతను, లఘుకృతియయ్యును వీరశైవమతమునకు సంబంధించిన గ్రంథ మగుటచేతను యథామతి సంస్కరించి యాంధ్రసాహిత్యపరిషత్తువారి కోరికపై యిందు బ్రకటించితిమి.

కృతి ప్రాచీనమైనది కావున మాసవరణలయందలి గుణదోషములఁ దెలిపిన సాదరపూర్వకముగ నందుకొందు మని మనవి.

బండారు తమ్మయ్య,

నిడుదవోలు వేంకటరావు, ఎమ్. ఏ.

---

1. ప్రథమ మాఘభారతిలోఁ బ్రభాకరశాస్త్రులుగారిచేఁ బ్రకటితము.
2. సిద్ధరాముని సంస్కృతోదాహరణము.
చూడుఁడు. (ప్రభాకరశాస్త్రిలవారి బసవపురాణపీఠిక. పుట 64.)
ఓరుగంటి రామకవి కవిశాలక్షణసారమున నుదాహరణ భేదములు.

కవిహంస.

ఆకుండి వెంకటశాస్త్రి.

కం. కందములు విడక సరసిజ
మందగతులు వెలయ మధురమధువ్రతగీతా
నందభ్రమరవిలసితము
లంది చరించెద వదెంతొ హాయిగ సుకవీ!

కం. కొందల మదేల నీ కే
వందలొ త్వన్మధురగళరవంబుల కీర్త్యం
బొందినఁ, గానీ యొరు లభి
నందింతురు నిన్ను నది ఘనమె గా సుకవీ!

కం. అంద మగుఁ త్వత్పదక్రమ
మందలి యొప్పిదము కుకవులరసి, యరసికా
మందదురూహాలచే నిను
నిందించిన నేమిలోటు నీ కో సుకవీ!

కం. కలిమి గలుగువసతులలో
మెలఁగెదు రుచ్యములు మిగుల మృదులము లగుభు
క్తులఁ గోరి చెడ్డవారిం
వొలఁగెదు సన్మానవిహృతులకై సుకవీ!

కం. కవి నీ వగుటనె యాదిమ
కవి యగునానలువ ప్రీతిఁ గాంక్షించిననిం
దవ్రులుట వాణికి సాజం
బవుఁగా క్షితిహితులహితము సరయుట సుకవీ!

కం. కోమటిబిడ్డల మెతుకుల
గావిడిక్రై గోము గనిన కాకవి నిన్నుం
దే మించఁగఁ బరువులిడం
గా మెచ్చున తెలివి గలజగ మ్మెన్నసుకవీ!

కం. భూరమణులఁ జేరి తదుప
కారముగా వారిసుగుణగణ మందందుం
బేరుకొని వారలబహూ
కారము లెన్నేని గాంతు గాదే సుకవీ!

కం. కలగుణదోషము లెంచం
దలఁచినఁ గొనవలయుఁ ద్వత్పదమె వేఱుగ ని
మ్ముల నీరక్షీరములం
దెలిపెడినే ర్పంతయుం ద్వదీయమె సుకవీ!

కం. మందపవమానతుందిల
నందనచందనమరందసవ్యాపృతని
ష్యందిభవద్రవములఁ జెపు
లం దనుపనివాఁడు భువి గలండే సుకవీ!

కం. సరసుల విడనాడక భా
స్వరపదవృత్తులను మృదులశయ్యయుఁ దగ మా
ధురిగలవారిని పొగడుచుఁ
జరియించెద వెంతభాగ్యశాలివో సుకవీ!

కం. కుందకు, కుకవికులము నీ
కుం దగునున్నతపదంబుఁ గూర్పదనుచు నీ
కుందనమువంటికీరితి
కిం దులవచ్చునె యొకించు కేనియు సుకవీ!

హల్లోహలము.

నిడుదవోలు వేంకటరావు

మనుచరిత్రలో.

కం. ఉల్లలదలకాజలకణ
పల్లవితకదంబ ముకుళపరిమళలహరీ
హల్లోహల మదబంభర
మల్లధ్వను లెసఁగ విసరె మరుదంకురముల్. (2-6)

అను పద్యమున టీకలో 'పరిమళలహరీ-సౌరభ' ప్రవాహమున ఈహత్-అభిలాష గలవగుచున్నట్టియు లోహల-అవ్యక్తధ్వనులుగల, మదబంభర-మదించినగండుతుమ్మెదలయొక్క ధ్వనులు అనికలదు.

కాని పై విధముగ 'పరిమళలహరి + ఈహత్ + లోహల' అని పదచ్ఛేదము చేయుట సరికాదనియు, 'హల్లోహలము' అను నేకపదమే యనియు నీక్రింది ప్రయోగములు తెలుపుచున్నవి.

1. భాగవతము దశమస్కంధము-పూర్వభాగమునఁ బోతన-

కం. ఉల్లసితకుచ భరంబుల
నల్లాడెడి నడుముతోడ నలరులదండన్
ఖిల్లియొకతె హాఁకిచ్చెను
హల్లోహలకలిత యగుచు నంగనకంచే. (793 పద్యము)

హల్లోహలపదము నుపయోగించినాఁడు-(ఇచట 'ఈహత్ + లోహల అని పదచ్ఛేదము చేయ వీలులేదుకదా!)

2. తెనాలిరామకృష్ణకవి పాండురంగ మహాత్మ్యమున-

శా. సాహిత్యాధరకాళిదాస! హరిపూజాగౌరవవ్యాస! గం
గా<u>హల్లోహల</u> వాగ్విలాస! రిపువర్ణత్రాసకృత్త్రాస! కాం

శాహార్ధాహవదృగ్విలాస ! శ్రుతివద్యాయోజితాభ్యాస ! హి
మాహార్యోపమ ధైర్యధుర్యపదవిన్యాసా ! విధేయాంరసా."

అని చతుర్థాశ్వాసాంతమునఁ గృతిపతి సంబోధించియున్నాఁడు.

3. ధరణిదేవుల రామమంత్రి దశావతార చరిత్రమున-

మ. ఖలనిద్రాననచుంబనావసర దృష్టిశ్రీకపోలస్ఫుర
త్పులకప్రీడితముగ్ధ కోకకుచ సభ్రూభంగమధ్యాధర
స్థలదంతక్షతకేళికావరమనోజాత ప్రగల్భాంగనా
కలనాదోదిత పాహిపాహిముఖవాక్కల్లోల హల్లోహలా.

అని నవమాశ్వాసాంతమునఁ జెప్పియున్నాఁడు-

4. శ్లేషయమక చక్రవర్తి వేంకటాచార్యకవి అచలాత్మజాపరి
ణయమునఁ బ్రథమాశ్వాసమున.

శా. మల్లీవల్లిమ తల్లివల్లరులలో మల్లోప మల్లోపమో
ద్యల్లీలోల్లుఠనంబునం బెనఁగుచున్ హల్లోహలోల్లోలమై
యుల్లంబిల్లిగనుల్లసిల్లెడి యళుల్ హల్లీసకోలానక
ఝల్లీ ఝిల్లకగీతి కల్లడ నుతుల్ చెల్లీనునప్పట్టునన్.

(41. పద్యము.)

అని యుపయోగించినాడు.

5. ఓగిరాల రంగనాథకవి ద్విరేఫవర్జ దర్పణమున.

కం. అక్షుద్ర భావనాశా
విక్షేత్ర కృపాఝులఝ్ఝురీ కల్లోలా
నుక్షణ హల్లోహల నిజ
వీక్షణ గుణసత్పథప్రవృత్తోద్ధర్తా.

అని చతుర్థాశ్వాసాంతమున వాడియున్నాఁడు.

పై ప్రయోగములవలన హల్లోహలమనునది యేకపదమని నిశ్చయమైనది. ఈపదము సమాసగతమైయుండుటచే నిది సంస్కృతపద మని గ్రహింపఁదగును. అయినను సుప్రసిద్ధసంస్కృత నిఘంటువులలో నీయఁబడినట్లు కానరాదు

తెలుఁగు కావ్యములలోఁ బ్రయుక్తములైన సంస్కృతపదములను బెక్కింటిని చూపిన 'సర్వశబ్దసంబోధినియం దీ' పదము కానరాలేదు. తెలుఁగు నిఘంటువులలో బ్రౌనుదొరవారి నిఘంటువునమాత్ర మీపదము కానవచ్చుచున్నది. వారి యింగ్లీషు - తెలుఁగు నిఘంటువులో (1291 పుట.) నీపదము హల్లోహలముగా గ్రహింపఁబడి దానికి తొట్రుపడ్డ, చీకాకుపడ్డ (Bewilbedened stumbled) అను నర్థములతో నుండి, మనుచరిత్రలోఁ బైపద్యమే యుదాహరణముగా నొసగఁబడినది. అందే దశావతార చరిత్రమునఁగల ప్రయోగము 'హల్లోహలుఁడుగా గ్రహింపబడి యిట్లర్థము వ్రాయఁబడినది.

"వాక్కల్లోల-వాక్యములనే మహత్తైన అలలయందు హల్లోహల తొట్రుపడుతూ ఉండేవాఁడా అనఁగా మునుఁగుతూ తేలుతూ ఉండేవాఁడని భావము".

బ్రౌనుదొరవా రీ పదమును మనుచరిత్రమున నేకపదముగా గ్రహించి తమనిఘంటువునం దిచ్చిను, వారికాలముననే యనఁగా. క్రీ. శ. 1851 లో ముద్రితమై, వారియాజ్ఞానుసారముగ శ్రీ. జూలూరి యప్పయ్యపండితులు వ్రాసిన టీకలో 'ఈహత్ + లోహల' అని పదచ్ఛేదము చేయుటయు నర్థము వ్రాయుటయు పరస్పర విరుద్ధముగ గన్పట్టుచున్నది- దీనికిఁ గారణము జూలూరివారి టీకారచనమునకుఁ దర్వాత యిరువదేండ్లకు దొరవారి నిఘంటుప్రకటనము జరగుటయేయని యూహింపఁదగియున్నది.

పాండురంగ మహాత్మ్యమున టీకలో 'హల్లోహల-ప్రవాహము వంటి'అని కలదు-

'అచలాత్మజాపరిణయము' టీకలో- హల్లోహల మత్తతచేతను: 'ఉల్లోలము-మిక్కిలి చంచలించుచున్నది' అని కలదు-

ద్విరేఫవర్ణదర్పణమున 'హల్లోహాలైర్మగ్నోన్మగ్నైః' అని కలదు-

పై విషయములఁ బరిశీలింప నిది హల్లోహలమను ప్రత్యేకపదమనియుఁ దీనికి, మునిఁగి తేలుట, తొట్రుపడుట, చీకాకుపడుట ప్రవాహము, మత్తత-మగ్నోన్మగ్నము అను నర్థములతోఁ గావ్యముల వ్యవహరింపఁబడినదనియుఁ దెలియవచ్చుచున్నది.

యతిప్రాసములలో హల్లోహల పదస్వరూపము వ్యక్తమగుచునే యున్నది.

ఉదాహృతపద్యములలో 'అల్లింబిల్లి'ఝుల్ఝుళీపదములు గమనింపఁదగినవి.

పదార్థవ్యుత్పత్తులకొఱకు పండితుల కిది నివేదితము.

హాస్యరేఖ.

వ్యాకరణవిద్యాప్రవీణ-విద్వాన్. చిలుకూరి పాపయ్యశాస్త్రి.

సీ. నవ్వెఁ గాననమునఁ బువ్వ లాయుష్మతి
          చిత్రదర్శనమునఁ జెన్ను మిగిలి
వీక్షించి మైథిలీవదనపద్మమునందు
          మందస్మితాంచితమధురరేఖ
వికసించెఁ గొమ్మల విమలకోరకములు
          నామోదభారంబు నమరఁ దాల్చె
గణియింపఁ దొడఁగెను గంధవాహుఁడు విరు
          లేవేవి విరిసె నెయ్యెడల ననుచు

గీ. సరగ మేల్కాంచి మత్తపుష్పంధయాళి
చెవుల గుసగుసలాడుచుఁ జేరికొనియె
నొక్కటొక్కటిగాఁగ నాచక్కటికిని
మధురదృశ్యదిదృక్షు ముమ్మరముగాఁగ.

సీ. నాటకంబున వచ్చునవ్యదృశ్యంబులఁ
          దిలకించురసికాళి ద్విజగణంబు
శాఖాసనంబులఁ జక్కఁగఁ గూర్చుండి
          మధురరసాస్వాదమగ్ను లైరి
అంతలో వైళమే యభినయారంభంబు
          లక్షింపఁ గోలాహలము చెలంగె
పంచవటీక్షేత్రభాసురరంగంబు
          ప్రియభావసంపత్పరీత మయ్యె

గీ. సీత వీక్షించె నవ్వు దాచిన్నలాఁడి
దిరిగి చూచెను లక్ష్మణధీరు నచట
మఱియు నిర్వురనడుమను మధురహాస్య
రేఖఁ గీలించి పలికెను ప్రేమవీణ

ఉ. ఎంతటి నిష్ఠురత్వము వహించితివోయి మఱంది నీవు; గా
వింతురె గేహసీమలను విందుల కిట్లవమాన మెచ్చటన్ ?

ఇంత మెలర్ప నిన్వలచి ప్రాణసమానునిగాఁ దలంచు నీ
యింటికి నన్యపూరుషుఁడ నే నరుచున్ వచియింప నొప్పునే.

ఉ. యాచకుఁ జిన్నపుచ్చి పరియాచకముం బొనరింప హెచ్చునం
కోచము చెందు; నీకుటిలకుంతల నిన్నిట నాశ్రయింపఁగా
వేచుట లేదు సర్వమును వేగమ యర్పణసేయ వచ్చు; సం
కోచ మి దేల? నీకుఁ గయికొంటనె; యిచ్చుట లేదు సుంతయున్.

ఉ. జానకిపాదపద్మములఁ జాఁగిలి మ్రొక్కె సుమిత్రసూనుఁ డా
మానిని దీవనల్నలిపి మందశుచిస్మిత యొప్పఁ బల్కె నే
నూనినవేడ్క నోమలఁది! యొప్పుగ వింటిని మీదుపల్కు లా
రా! నయ మొప్ప నూత్నశుకరంభల కెప్పటినుండి వాదమో?

ఉ. పిమ్మట బాలతోఁ బలికెఁ; బేలవు కాకుము వామలఁది! యె
క్కిమ్మెయివాఁడె; యెన్ని వచియించినఁ బెంకితనంబు మాని మా
త్నమ్ముగ వచ్చినట్టిచెలిఁ దానయి యింటఁ బరిత్యజించి పం
త మ్మెదఁ దాల్చి వచ్చె నిది ధర్మమె యిట్టివిరాగ మూనుటల్.

ఉ. కోరదవేని నీ వితని నోమలి! యొప్పుఁగఁ జేయుదాన; నీ
వారట మందకమ్మ మన మారసి నీని వరుం బొనర్తు భా
మా! రహి నీకు; నైనను సమందసమృద్ధిసమేత నీవు; ని
స్సారులనై యరణ్యమున సారెకు వేసరు మంటి వీగతిన్.

ఉ. స్వామికి దాసినై యిచట సల్పెదఁ గాపుర మేను గాని యో
భామిని! నీకు నేవసులభారము కొంచెము గల్గనీను; నీ
కోమలహస్తపద్మములకుం గయిసేఁతభరంబు గూర్తునే?
కామిని కోర్కె తీఱ నొడికంబున నేన యలంకరింపనే?

గీ. కాని యొక్కటి మన్నింపఁ గలదు నీకు
నేను తెంచిన పశుపక్షివిరర మొకట
కొంటెతనమునకై దొరఁకొనెడి వేళ
వానిఁ బ్రేముడి సహియింపవలసియుండు.

(పంచవటి యనుకావ్యమునుండి.)

బాలవ్యాకరణము, గుప్తార్థప్రకాశిక.

(ప్రథమసూత్ర వివరణ పర్యాలోచనము.)

వ్యాకరణవిద్యాప్రవీణ - విద్వాన్

దర్భా సర్వేశ్వరశాస్త్రిగారు.

"ఆంధ్రదేశంబున వాడఁబడుభాషకు నాంధ్రభాష యని పేరు. భాష యనఁగా జనులు పరస్పరాభిప్రాయములను దెలియఁజేసికొనుటకు సాధనంబులై యనాదిసంకేతంబులైన ధ్వనులు. ఇయ్యది వాగ్రూప మనియు లిఖితరూప మనియు ద్వివిధము" ఇత్యాదికము గుప్తార్థప్రకాశిక యందుఁ గలదు.

భాష ధ్వనిరూప మని పైగ్రంథముంబట్టి స్పష్ట మగుచున్నది. కాన "ఇయ్యది వాగ్రూపమనియు లిఖితరూపమనియు ద్వివిధము" అను వాక్యము చింత్యము. లిపియనునది కలము మొదలగువానితో వ్రాయు గీఁతలుకాని భాష కాదు. ఈగీఁతలు భాషకు స్మారకములు, అనఁగా భాషయొక్క స్మృతిని గలిగించును. స్మృతమైన యాభాష అర్థబోధక మగును. గీఁతలు ధ్వను లెట్లగును? గీఁతలు చక్షురింద్రియజన్యప్రత్యక్ష విషయములు, ధ్వనులు శ్రోత్రేంద్రియజన్య ప్రత్యక్ష విషయములు గదా! ఇట్లు భిన్నేంద్రియగ్రాహ్యము లగునీరెండును నేకత్వమును బొందఁ జాలవు. లిపిగూడ భాషయే యని తుష్యతుదుర్జనన్యాయమున నంగీకరించినయెడల నాంధ్రలిపియందున్న రఘువంశము వే అనియు నాగరలిపియందున్న రఘువంశము వే అనియు కర్ణాటలిపియందున్న రఘువంశము వే అనియు జెప్పవలయును. అవి మూఁడును భిన్నములేని, కాళిదాసకవి దేనికి కర్త? మూఁడింటికిని కర్త యందుమా! కాళిదాసకవి మూఁడు రఘువంశములు చేసె నని యొప్పుకొనవలసినవార మగుదుము. ఇట్లనుట మిక్కిలిహాస్యాస్పదము: లిపి భాష యనుట వైయాకరణ నైయాయిక మీమాంసకాది సకలమతములకును విరుద్ధము.

"శ్లో. కంఠస్యావహా విచుయుశా స్తాలవ్యా ఓష్ఠజా వుపూ"

అని వైయాకరణులు వర్ణములకు కంఠ్యాదిస్థానములను మాత్రమే చెప్పిరి. లిపి గూడ భాషయనివారి కభీష్టమైన యెడల, తాటాకో కాగితమో కలమో మఱి యేదియో ఉత్పత్తిస్థానముగఁ జెప్పియుందురు. తార్కికులును

శ్లో. శబ్దో ధ్వనిశ్చవర్ణశ్చ మృదంగాదిభవో ధ్వనిః
కంఠసంయోగాదిజన్యా వర్ణాస్తే కాదయోమతాః.
సర్వశ్శబ్దో నభోవృత్తిః శ్రోత్రోత్పన్నస్తు గృహ్యతే.

అని చెప్పిరి: మీమాంసమున్నగువానియందుఁ గూడ నిట్టికలవు. కొన్నిపట్ల కావ్యాదులందు స్మర్యమాణస్మారకములకు లాఘవాద్యనురోధముచే నభేదవివక్ష చేసినను జేయవచ్చును.

సూ. సంస్కృతభాషకు వర్ణంబు లేఁబది. ౧

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ అం అః. క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ ళ. ఇందకారాదులు అచ్చులు. కకారాదులు హల్లులు అజ్ఝల్విభాగ మీలాగుననే మీఁద నెఱుంగునది అని బాలవ్యాకరణమునఁ గలదు.

సంస్కృతభాషయందుఁగల ప్లుత జిహ్వామూలీయోపధ్మానీయేషత్స్పృష్టఋకారాదులనుగూడ లెక్కింపఁగా సూత్రమునందలి యేఁబది యనుసంఖ్య యెట్లు సమంజసమగును? వివరణమునందు ఈప్లుతాదులను జేర్పకయుండుటయుఁ జింత్యమే. ఇందులకు శ్లో. త్రిషష్టిర్వా చతుష్షష్టిర్వర్ణాః ... అనుపాణినీయశిక్ష ప్రమాణము. (=సంస్కృతభాషయందు అఱువదిమూఁడు లేక అఱువదినాలుగు వర్ణములు గలవు అని భావము) అఱువదినాలుగులో నేఁబది కలవు గాన సూత్రమందలి యేఁబది యనునది శతేకంచాశన్న్యాయమున సమాధేయమని చెప్పుటయు నిట్టిపట్టుల హాస్యాస్పదమగును ఈషత్స్పృష్ట ఋకార ఌ కారములకు దుస్పృష్టమని పేరుగాన దుస్పృష్టమని యఖండముగ లెక్కించిన నఱువదిమూఁడును పై ఋకార ఌ కారములను భిన్నముగా లెక్కించిన నఱు

పదినాలుగును వర్ణములని పైకారికలోని వాక్యార్థ మని యెఱుఁగునది. "ఆంధ్రభాషలో నుపయోగించు సంస్కృతభాషావర్ణములను మాత్రమే చిన్నయసూరిగారు చెప్పిరి గాన ప్లుతాదులను జెప్పకపోవుట తప్పు కాదు" అని చెప్పినయెడల "మనఃక్షోభము, దుఃఖము" అనునవి తెనుఁగున వాడఁబడునవియే గాన దోషము తప్పదు. శ్లో. ఆద్యాయాః పంచాశద్వర్ణాః" అని చింతామణియు, శ్లో. ద్విధాక ఏచో నుస్వారో విసర్గషోడశ స్వరాః, స్పర్శా అంతస్థ ళోష్మాణ శ్చతుస్త్రింశ ద్ధల స్స్మృతాః" అను వృద్ధకారికయు పైసూత్రమునకుఁ బ్రమాణ మని చెప్పినయెడల 'బాధే దృఢే వ్యపామ్యాత్కి' మనెడి న్యాయము స్మృతికి వచ్చుచున్నది. శ్లో. బాధే దృఢే వ్యపామ్యాత్కిం దృఢేప్యదపి బాధ్యతామ్, అని న్యాయము. గ్రంథమునందుఁ జెప్పినదోషము దృఢమా? అదృఢమా? అనివిచారించునపుడు దోషము అదృఢమైనయెడల ననఁగా వాస్తవముగాఁ బ్రమాణసిద్ధము కానియెడల గ్రంథాంతరప్రదర్శనము వ్యర్థమే! దోషము దృఢమైనయెడల ననఁగాఁ బ్రమాణ సిద్ధమైన యెడల అట్టి దోషసహిత మైన దాని నెవ్వరు చెప్పినను మన కగ్రాహ్యమే యని పైన్యాయమున కర్థము. ప్లుతాదులు సంస్కృతభాషయందు స్పష్టముగా నుండఁగా లే వని చెప్పిన చింతామణ్యాదులును గ్రాహ్యములు కా వనియే నాయభిప్రాయము. సంస్కృతవ్యాకరణ సుప్రసిద్ధములగు జాతి వ్యక్తి పక్షములనాశ్రయించి సమాధానము చెప్పుట యశక్యము. హ్రస్వాకారము లన్నియు అభివ్యక్తిబట్టి భిన్నములుగాఁ గన్పట్టినను వాస్తవముగా వర్ణమాత్ర మేకమే. ఇట్లే దీర్ఘాకారాద్యచ్చులు కకారాదిహల్లులు నని దీక్షితాభిమతవ్యక్తిపక్షము. ఈమతమున ప్లుతాదులను జెప్పమి సూరిగారికి న్యూనత. ప్రత్యుచ్చారణం వర్ణభేదః (=అకారాదు లుచ్చరించునపుడు పుట్టునవి గాన భిన్నములు) అని నాగేశాభిమతవ్యక్తిపక్షమున అకారవ్యక్తు లే అనంతములుగాన యేఁబది యనుటయు నసంగతమే. జాతిపక్షమున హ్రస్వదీర్ఘప్లుతములకుం దుండెడి యత్వజాతి యొక్కటియే గాన అ ఆ ఇ ఈ అం దీర్ఘనిర్దేశము వ్యర్థమే. ఈవిషయమున నిరూపింప వలసినవి చాలఁ గలవు, వ్యాసవిస్తరభీతిచే విరమించితిని.

ఋ ౠ ఌ ౡ. వివృతదీర్ఘమగు నీ ౡకారము నుపదేశించి ౡకారమని యుదాహరించుట న్యాయము కాదు. అనుకరణమునందు సర్వవర్ణములును సాధువు లని ఋఌక్సూత్రభాష్యమునందు చెప్పబడినది గాన ననుకరణమునందు సాధువులగు వర్ణముల నుపదేశించుటకుఁ బూనుకొనుట సముద్రమునకు సేతా మెత్తుటయే. మఱియును ఈౡకార మీషత్స్పృష్టదీర్ఘము, వివృతదీర్ఘము కాదు అని గూఢార్థప్రకాశికలో స్వమతము వర్ణింపఁబడినది. పై వర్ణోపదేశమందు ఈషత్స్పృష్టదీర్ఘౡకారము కలదేని ౠకారములు రెండు ఉపదేశింపవలయును. ఒకటి ఈషత్స్పృష్టదీర్ఘము, మఱియొకటి వివృతదీర్ఘము. ఈరెండిటిలో నొకదాని నుపదేశించి రెండవదాని నుపదేశింపకుండుటకుఁ గారణము లేదు గాన గూఢార్థప్రకాశికామతము చింత్యమే. ౠ అను దీర్ఘర్కారము వివృత మనియు నీషత్స్పృష్ట మనియు ద్వివిధము. అందు వివృతమునకు మధ్యభాగమున నొక రేఫమును జుట్టు నజ్భాగమునుకలదు. ఈషత్స్పృష్టమునకు మధ్యభాగమున రెండు రేఫములును జుట్టు నజ్భాగమును గలదు. ఇట్లే ౡకారమును ద్వివిధము. కాని మధ్యభాగముననొక లకార మున్నదివివృతము. రెం డున్నది యీషత్స్పృష్టము అని సంస్కృతవైయాకరణులకు సువ్యక్తము. అందు "మంత్రశాస్త్రంబున అకారాదిపంచాశద్వర్ణావళి (50) జపమాలికగా భావింపఁబడుటచే వైసంఖ్యాపూర్తికై ౡకారదీర్ఘంబును సమ్మతింపఁబడిన దందురు" అని ఇతరమత ముపన్యసింపఁబడినది. ఇదియును జింత్యమే. ఏలన, మంత్రశాస్త్రము ౡం నమః అని తత్తదుపాసనలయందు ఫలదాయక మని చెప్పుచున్నది. కాని భాషలోఁ గల దని నిరూపింపలేము.

భాషలో నున్న మొదల నర్థబోధక మగు ౡకారఘటితపద ముండవలయును. అట్టిదాని నెవరును జూపలేదు. ఇట్లు కాదేని సామగానమున ఫలదాయకము లగుచు "అధ్వర్యోబద్రిభిః" ఇత్యాదులందు ప్రసిద్ధములగు నర్ధైకారార్ధౌకారములు గూడఁ గల వని యొప్పుకొనవలయును. అట్లైన న్యూనత స్పష్టమే. శ్లో. ౡకారో దేవనార్యాం స్యా న్నార్యా

త్వస్యపి మాతరి, అని మేదినీకోశావ్యయప్రకరణమునఁ గల దందురా? ఛందసి పరిపంథి పరిప'ణౌ పర్యవస్థాతరి, అని పాణిని సూత్రముండఁగా, “ప్రత్యర్థిపరిపంథినః” అను నమరకోశోక్తికి ఏగతియో యదియేగతి యీ మేదినీకోశమునకును గల్పింపవలయును. విమర్శింపఁగా ౡకార దీర్ఘము వైదికము, లౌకికము కాదు అని నాకుఁదోఁచిన సిద్ధాంతము. “ఌవర్ణస్యద్వాదశ తస్యదీర్ఘాభావాత్” నుకౌముదీగ్రంథము లౌకికసంస్కృత భాషావిషయమే. “ఏఓఙ్” సూత్రస్థమగు “వర్ణైకదేశా వర్ణగ్రహణేనచే త్సంధ్యక్షరేషు సమానాక్షరవిధిప్రతిషేధః” అనువార్త్తికమున “సమానశబ్దేన పూర్వాచార్యనిర్దేశా దకో భిదీయంతే దశసమానా ఇతి వచనాత్ అనుప్రదీపవ్యాఖ్యానావసరమున నుండు “వచనా దితి. అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ దశసమానాః ఇతిపూర్వవైయాకరణ వచనా దిత్యర్థః” అను ఉద్ద్యోతాదిగ్రంథము వైదికవిషయక మని చెప్పుట న్యాయ్యము. శౌనక ప్రాతిశాఖ్యయందుఁగూడ ౡకారదీర్ఘము కలదని కలదు. ఇదియును వైదికవిషయమునకుఁ బ్రమాణము కాఁగలదు. వైదికభాషామాత్రగోచర మగు ళకారము నుపదేశించినసూరిగారు వైదికభాషామాత్రగోచరమగు వివృతదీర్ఘౡకారము నుపదేశించి రనుటకు బాధక మేమియు నాకు స్ఫురించుటలేదు. అగ్నిమీళే ఇత్యాది వేదమందు అజ్మధ్యస్థ డకారస్యేత్యాది ప్రాతిశాఖ్యలచే విహితముగాన వైదికభాషామాత్రగోచరమగు ళకారోపదేశము తప్పగునపుడు ఈవివృతదీర్ఘ ౡకారోపదేశము గూడతప్పె యగును.

“ఇం దకారాదు లచ్చులు కకారాదులు హల్లులు, అజ్ఘల్విభాగ మీలాగుననే మీఁద నెఱుంగునది” అనుదానికి “పై యేఁబది యక్షరంబులలో అకారము మొదలుకొని విసర్గము వఱకు అచ్చు లనియు, కకారము మొదలు ళకారము వఱకును హల్లు లనియును బేరు. అజ్ఘల్విభాగము (అచ్ + హల్ + విభాగము = అచ్చు లనియు హల్లు లనియు, ఏర్పాటు)

ఈలాగుననే అకారాదు లచ్చు లనియు కకారాదులు హల్లు లనియుఁ, బ్రాకృతభావకును దెలుఁగునకును, దెలిసికొనునది.” అని సూత్రప్రకాశికావ్యాఖ్యానము కలదు. అనుస్వారవిసర్గములకు సంస్కృతమున అచ్సంజ్ఞయు హల్సంజ్ఞయు రెండును నుండఁగా నచ్సంజ్ఞయే కల దనుటచింత్యము. దీనికిఁ దెనుఁగున నచ్సంజ్ఞకే ఫలముగాని హల్సంజ్ఞకు ఫలము లేదు గాన నట్లచ్సంజ్ఞయే చెప్పఁబడిన దని సమాధానము చెప్పుట న్యాయముకాదు. విమర్శింపఁగా నచ్సంజ్ఞ లేదు, హల్సంజ్ఞయే కల దనుట యుక్తతరమని తోఁచెడిని. అచ్సంజ్ఞ లేదనుటవలన రాముండు అనుచోట “ఉత్తునకచ్చు పర మగునపుడు సంధి యగు” అనుసూత్రము చేత మకారోత్తర మందుండు ఉకారమునకు ననుస్వారరూపమగు హల్లు పరమగుటచేత నచ్చు పరము కాలేదు. కావున సంధి రాలేదు. అనుస్వార మచ్చైనయెడల సంధి తప్పదు. అనుస్వారవిసర్గములు హల్లు లనుటవలన, ప్రాసములందచ్చేదియైన నుండవచ్చును కాని హల్లు అదియే యుండ వలయు నను నియమము కలుగుటచేత ననుస్వారప్రాసమునం దనుస్వార ముండుటయుఁ దదుత్తరహల్లుకూడ నియమముగ నుండుటయు సమంజస మగుచున్నది. “అంకము చేరి” మొదలగు పద్యములకట్ల అందము అనుప్రాసమునకు దోషము సిద్ధించుచున్నది. ప్రాసములం దచ్పూర్వవర్తిహల్లులకు నియమము కలదు గాని అజుత్తరవర్తి హల్లునకు నియమము లేదు గాన ననుస్వార మచ్చైనయెడలఁ దదుత్తర కకారమునకు నియమముండదు. కాన “అందము” అని ప్రాసములందు అనుస్వారోత్తరమునఁ దకారం మేల యుండరాదో యూహింపుఁడు. క. అ ఆ లై పొలుపుమీఱి, ఇ ఈ లు ... అని కవిజనాశ్రయమున సంజ్ఞాధికారమున కలదు. ఆకారమునకు సమముగా నీకారము ప్రాసమునఁ గలదు. కాన ప్రాసము లందజ్నియమము లేదనియేసిద్ధాంతము. కనుకనే, ఉ. అమ్మలఁ గన్నయమ్మ. . నమ్మిన వేల్పుటమ్మల ఇత్యాదులందు “మ్మ” అనుదానికిఁ దుల్యముగ వాడిన “మ్మి” అనుప్రాసము సాధు వగుచున్నది. మఱియు కణఁతి, కణంతి = గ్రంథి. కడఁది, కడింది = ఆపద. వీనికి బహువచనమున

"వికృతియం దికారాంతముల యుపోత్తమేత్వమునకు ఉత్వం బగు" అను సూత్రముచేత కణుఁతులు కణుంతులు కదుఁదులు కదుందులు అను రూపములగును. ఈబిందువునకు నచ్చట మున్నమొదల బిందువే యుపోత్తమము గాని ఇకారము కాదు గాన నుత్వము రాక కణింతులు మొదలగు విపరీతరూపములగును. హల్లే యయినయెడల కణుంతులు మున్నగుసాధురూపములు సిద్ధించును.

అర్ధానుస్వారము హల్లే అని అంగీకరించినను కలఁగి చెలఁగి ఇత్యాదులందు సంయోగపరక లకారోత్తరాకారము అక్రుచు విద్రుచు చిద్రుపలు మున్నగుచోట్ల దరసంయోగపూర్వ స్వరమువలె గురువు కాదని యెఱుఁగునది. భారతాదికవు లర్ధానుస్వారప్రాసమును పాటించుటచేత నిదియును హల్లని చెప్పవచ్చును. లేదా, ఇదివర్ణమే కాదు: పూర్వవర్ణము అనఁగా పూర్వస్వరమున కనునాసికత్వమును దెలియఁజేయుగుఱుతు. కలఁగు, చేఁదు మొదలగుపట్ల అర్ధానుస్వారపూర్వస్వరంబులు అనునాసికములుగా నుచ్చరింపవలయును. సంస్కృతమునందును సయ్యంతా, సంయంతా ఇత్యాదిరూపములందు "అత్రానునాసికః పూర్వస్యతువా, సూత్రముచేత నకారోత్తరాకారమునకు అనునాసిక్యము విధింపఁబడినది. అట్టిదియ యిదియును. సంస్కృతలిపియం దీగుఱుతు పూర్ణానుస్వారముతోఁ దుల్యముగ నుపస్థితము. ఈయాంధ్రభాషాలిపియందు పార్శ్వస్థితము, అనుమతమున సంయోగము లేదు. కానఁ బూర్వస్వరమునకు గురుత్వాపాదనమునకు నవకాశమే లేదు. కందాదులందు ప్రాసపూర్వస్వరమునకు గురుత్వలఘుత్వ నియమమువలెఁ బ్రాచీనులమతమునఁ బ్రాసపూర్వస్వరమునకు నానునాసిక్యనియమము సర్వత్ర కలదని యెఱుఁగునది. ఈమతమున నర్ధానుస్వారమును వర్ణాంతరముగా చిన్నయసూరి పృథక్కరించుట చింత్యమే.

సంస్కృతమున అనుస్వారము హల్లుకూడ నగును గనుకను దెనుఁగున హల్లే యగుటచేతను సంయుక్తము పరమగు నపుడు

పూర్వవర్ణము గురు వను వాక్యముచేత నందము ఇత్యాద్యులం దకారము గురు వగుచున్నది. శ్లో. సానుస్వారో విసర్గాంతో దీర్ఘో యుక్తపరో గురుః" అనుచోట సానుస్వారః విసర్గాంతః అనునవి యుక్తపరః అనుదానికిఁ బ్రపంచనూపము లవి యెఱుఁగునది. సానుస్వారో విసర్గాంతః అనునవి ప్రపంచార్థము కావుననే భగవత్పాణినిమహర్షి "హ్రస్వం లఘు, సంయోగే గురు, దీర్ఘం చ" అనియే సూత్రించి సానుస్వారవిసర్గములకుఁ గూడ గురుసంజ్ఞ నుదిరిగి విధింపలేదు. సంస్కృతమున వీనికి రెండుసంజ్ఞ లుండుటకు ఫలములును రామః, హరిః, హరిం వందే ఇత్యాద్యులందు సవర్ణదీర్ఘయణాదేశాదులు రాకుండుటకు కారణములును బాణినీయమును బట్టియే యూహించునది. తెనుఁగున సిద్ధానుస్వార ముండుటచేత నట్టియుపపత్తు లిట పొసఁగవు ?

మఱియును అకారాదులు = అకారసదృశములు. (ఇటసాదృశ్యము స్వాతంత్ర్యోచ్చారణత్వ మని వివక్షింపఁబడినది) కకారాదులు=కకారసదృశములు (ఇటసాదృశ్యము ఇతరాధీనోచ్చారణవిషయత్వ మని వివక్షింపఁబడినది) అనుస్వారవిసర్గములు హల్లులు వలెనే అచ్చులకు అధీనమైన యుచ్చారణము కలవిగాని అచ్చులువలెనే స్వతంత్రముగా తఱుచుచ్చరింపఁబడునవి కావు గాన సాదృశ్యము పై విధముగ వివక్షింపఁబడినది. ఇట్లు వ్యాఖ్యానము చేయుటచేతఁగాని కకార స్యాదీ కకారాదీ, కకారః ఆదిః యేషాం తే కకారాదయః, కకారాదీచ కకారాదయశ్చ కకారాదయః అని సర్వత్ర లోహితాదిక తం తేభ్యః భూవాదయో ధాతవః అను సూత్రముల భాష్యమునందుఁ జెప్పబడినరీతిని వ్యాఖ్యానము చేయుటచేతను గాని హల్త్వసంపాదనాచ్త్వనిషేధములను సిద్ధింపఁజేయవచ్చును. ఇట్టిక్లిష్టకల్పనము శ్రీసూరిగారికభిప్రేతమని తోఁపదు.

కావ్యార్థసంగ్రహ సమాలోచన

ఉభయభాషాప్రవీణ—మల్లాది సత్యనారాయణశాస్త్రి.

(అనువృత్తము.)

ఆకారణముచేఁ బూర్వాపరస్థస్వరూపభేదమువీడి లక్ష్యగ్రంథములలో లక్షణోక్తాంశములు స్వయముగ నుపనిబంధింపఁబడి యుండవచ్చును. కనుకఁ బై లక్ష్యలక్షణగ్రంథనిర్మాతలు కావ్యధర్మనిబంధనావసరమున వాసనావాసితైకఘంటాపథముననే పోవఁ జూచి రనునామాట పూర్వగ్రంథములను బట్టి యసత్యము కాదు. కనుక లక్ష్యగ్రంథములను గొన్నిఁటిని జూచి లక్షణగ్రంథములను జేసి రనుట యంత విమర్శోత్పన్నము గా దని నాయభిప్రాయము. అట్లుకానిచో నాలక్ష్యగ్రంథకర్త మాత్ర మావిధముగ మొదటగా నాగ్రంథమును జేయుట యెచట నేర్చినాఁడు? ఆ నేర్పు లక్షణగ్రంథకర్తకు మాత్రము మొదటగాఁ గలిగినచోఁ దప్పా? పాణిన్యాచార్యుఁడు శబ్దశాస్త్రమును వ్రాయుచు నే గ్రంథమును మున్నిడుకొనెను? కనుక లక్ష్యలక్షణగ్రంథములు పరస్పర ముపజీవ్యోపజీవకత్వము నందవలయు నని గాని యన్యోన్యవిరుద్ధము లని గాని యనరా దని నాభావము. వానియందు సహృదయశాస్త్రజ్ఞులు తాత్పర్య ముంచిన నవి యానామధేయమునకుఁ దగియున్నవియే యగును. వానిసంపూర్ణతాసంపూర్ణత లిచటఁ జర్చార్హములు గావు. ప్రకృతమునకుఁ బోదము. అట్టి లక్షణగ్రంథములలో నుత్తమనాయకచరితములనే లక్ష్యగ్రంథములలో నిర్దేశింపవలయు నని ముక్తకంఠముతో ముచ్చటింపఁబడినది. పూర్వలక్ష్యగ్రంథములలోను సాధారణముగ నట్లులే చేయఁబడినది. అయినను కేవలతాత్కాలిక చమత్కారఫలితములుగఁ బూర్వమునను, నానాభాషలలో నిపుడును, జార, చోర, క్రూర, మారకచరితములు సహృదయులు బాపురే యను

నట్లు వస్తుసందర్భసంవిధానమును బురస్కరించుకొని రచనారమణీయ తను మఱువక కయితలు చెప్పుకవివరేణ్యులచేఁ గల్పనానైపుణితోఁ బుట్టి నొందింపఁబడి గ్రంథరూపమును దాల్చినవి యెన్నివేలు లేవు? వానినుండి మాత్రము రసభావాదులు పొంగి పొరలకపోయినవా? చూడుఁడు.

> సంచరింపుము ప్రాజారి! సంకుచింప
> కిపుడ యీవేఁపి సచ్చెను గినుకఁ బూని
> రమ్యగోదావరీజలప్రాంతభూమి
> కుంజమున నుండుసింగంపుఁగోదము చేత.

అను సీసపద్యమునకు మాతృకయగు శ్లోకము కావ్యప్రకాశాదులలో నుత్తమోత్తమధ్వనికావ్యముగ నైకకంఠ్యముతో నుదాహరింపఁబడినది. ఆశ్లోకము కర్ణాడ నార్యాసప్తశతిలోనిది. ఆగ్రంథమును వ్రాసిన గోవిం దవర్ధనాచార్యమహాకవి యీపద్దెముల నొకదానితో నొకటికి సంబం ధము లేకుండ ననఁగా వ్యంగ్యార్థము కేవలము కవి భావక సహృదయ లాసముల్లసిత మనుటకై ప్రకరణాదిసహాయము లేకుండునట్లుగా నేర్ప ఱచినాఁడు. మఱియు నాశ్లోకము లోకోత్కృష్టియు నొకోత్కృష్ట కావ్య మని పెద్దల నిర్ణయము. కనుకనే పండితరాయలు "రమణీయార్థ ప్రతిపాదక శ్శబ్దః కావ్య" మ్మని శబ్దమాత్రమునకుఁ గావ్యత్వము నాపాదింపఁగలిగెను. ఇట్లన్నిలక్షణములు బాగుగనే యున్నవి.

కాని యీపద్యమునందలి వస్తువు మాత్రము చెప్పుకొనఁదగినంత నీతి బోధకము గాదు. కాన నిట్టివానిని గనినవారు గ్రంథపఠనపర్యవసానమున నేర్చుకొనఁ దగినన్ని నీతులు నేర్వఁజాల రని నాయభిప్రాయము. గ్రం థోద్ధృతనీతు లన్నియుఁ బాఠకులు నేర్చి యట్లు దామును గొంతవఱ కైన నడచుకొన యత్నింతు రని గదా! చదువనివారిమంచినడవడికకంటెఁ జది వినవారిమంచినడవడిక యాధిక్యముతోఁ బ్రశంసింపఁ బడుచున్నది. మఱి యుఁ జదివినవారితప్పును జదువనివారితప్పుకంటె మిక్కిలి నింద్యముగఁ జూచుచున్నారుకూడ.

కొన్నియెడలఁ గవిప్రౌఢోక్తనీత్యుపదేశములకంటెఁ గవినిబద్ధవక్తృప్రౌఢోక్తనీత్యుపదేశములయందు సౌందర్యము మెండుగఁ గలుగుచుండును. కనుకనే ధర్మశాస్త్రానుశాసనాదులు గావ్యానుశాసనాదులకంటె నుపాదేయత్వరూపాచరణమున వెనుకఁ బడుట సంభవించుచున్నది. అట్లు కానిచోఁ గావ్యోత్పత్తికే తావు లేదు గదా. కనుకఁ గావ్యములయం దుత్తమనాయకచరితములనే యుపనిబంధింప నవసరమని తేలుచున్నది గదా. ఉత్తమనాయకచరితములనుండి, పాఠకులు గ్రహింపఁ దగినవిషయములు వేనవేలు ప్రత్యంశమునందును స్ఫురించుచుండును. చూడుఁడు; భూలోకమహేంద్రుఁ డగుదశరథమహారాజునకు లేక లేక కలిగిన సంతానములో సుగుణములచేతను సర్వోత్తముఁ డనఁ దగు శ్రీరామచంద్రుఁడు పదునాలేండ్లకు లోఁబడివయస్సువాఁడైనను సౌధాగ్రమునుండి యంతకుమునుపు దిగనివాఁడైనను బహుదూర మొక్కముసలిమునివెంట నడియే మొదలుగాఁ గాలినడకను బోవలసివచ్చినను, దా నపుడును నెండకన్నెఱుఁగక పోయిన నిపుడైన ఛత్రచామరాద్యనేకభోగసాధనములు బొందనివాఁడైనను దారుణ భయంకర, ప్రబల, మాయావి, మనుష్యమాంసాదనులసంఘముతో బవరము చేయవలసి యున్న దని యెఱిఁగియున్నను, అనేక దేవాసుర యుద్ధములలో మహేంద్రసమాహూతుఁడై సంగర మొనరించి విజయలక్ష్మీకరస్థమంగళకుసుమమాలికాపినద్ధవక్షుండై వానికష్టసుఖముల నామూలాగ్రము గుర్తెఱిఁగినతండ్రిచే విడువఁబడ సమ్మతి లేనట్లు దెలియఁబడుచున్నను, యాగసంరక్షణమునకుఁ గాను విశ్వామిత్రునిచేఁ గోఁబడి తప్పనిసరిచేతఁ దండ్రిచేఁ బంపఁబడి కుతూహలియై కాకపక్షము లెగిరిపడఁ జిన్నచిన్నయడుగులపాదములను, చిన్నధనుస్సును, కోమల మాంసల భుజశిరములను, ఆయత భుజాగ్రహస్తమున ధరియించి యనుజలక్ష్మణద్వితీయుఁడై, నదురును బెదురును లేక యామునివెంట నేఁగెనఁగా నిందలి నీతులు ఎన్ని నేర్వఁ దగియున్నవో లెక్కింపఁ దరమా?

పాలకుని పరిపాలనాధర్మ మట్లుండవలె నని వీర్యవంతునకు వయసు
తో నెదిరిబలఁగముతోను బని లే దని, రాజధర్మము బహుభోగసాధనములు
గలదిగ నుండుటమాత్రమే గాని రాజు నిత్యసుఖాపేక్షగ నుండరా దని,
క్రియాసిద్ధి ప్రధానముగాని బహుళసాధనసంపత్తితో నిమిత్తము లే దని
శాస్త్రీయమైన యజ్ఞాదిదైవకార్యములపట్ల శ్రమ మైనను జిన్నతన మైన
ను, సహాయసంపద తక్కువ యైనను, రాజన్యుఁడు దేశధర్మరక్షణకై
దీక్ష వహించి నిర్భయముగా నెదుట నిలువ వలయు నని, యిఁకయు వీని
నుండి మఱికొన్నియు దేశక్షేమంకరగుణాభివర్ధిక లగునీతులు స్ఫురించుట
లేదా? ఇట్లు నేర్చినీతులను బట్టి మన మందఱము లోకమున మంచి
నడవడిఁ గలిగి యుండు మను నిర్ణయము చేయలే కున్నను నూటి కొక్క
నిది గాని వేయి కొక్కనిదిగాని జన్మాంతరోపాత్తకర్మ మంచిది యై
యుండు నని యనుకొనిన పక్షమున వాని యా కర్మకు ఫల మగు
సుగుణసంపత్తి నిత్య మగునాతని మనసునందు నంకురము బీజము
నందుఁ బోలె మొదట నణఁగి యుండి యితరసహకారకారణ మగు
పదేశ, సజ్జీవన, సంమేళనాది సామగ్రితోఁ గూడినపుడు బయటికి నుద్బు
ద్ధ మగుచుండును. గాన దానివలన న్నాగుణి గ్రామణి గ్రహములలో
సూర్యునివలె నక్షత్రములలోఁ జంద్రునివలె జనసమూహములో
మొదటగా నిలుచుచుఁ దన పరోపకారపరతాద్యుత్తమక్రియాకరణ
దీక్షను బూనును గాన నున్నతుఁ డై చిరకాలము ధగధగలా
డకపోఁడు. ఇతరులు నా యాకార్యములనుఁ జేయుచు నట్టిత్తొంద
రలపట్ల నీ కథాశ్రవణజన్యజ్ఞానము కొంచెముగ నైన వారిమనస్సును
మార్పక పోదు. ఇట్టి ప్రయోజనములు నీచనాయకాశ్రయ కథాశ్రవణ
పఠనములవలనఁ గలుగఁబోవు. ఇచటఁ బైనఁ జెప్పినగుణము లెక్కువ
గలవార లే యుత్తమనాయకు లనియుఁ దక్కువగుణములు గలవారలే
నీచనాయకు లనియు గ్రహింపవలెను. ఒకప్పు డానీచనాయకులుగూడ
నొకటిరెండు మంచిగుణములు గలవార లగుటచేతనే యొకకొందఱు కవి

హృదయముల నాకర్షించి వారిచే సందముగను జాలిగను జెప్పఁబడిన స్వగుణానుకథకగ్రంథములమూలమునఁ గొంతకాలమువఱకు జనులచే స్మరింపఁ బడుచుండుట యరయు చుండుము. అట్లయినప్పుడు చాల గుణములు గలవారివిషయము నఁ జెప్పవలసినదేమి ?

కవులురసవంతముగఁ గావ్యములను నిర్మించుటయే భావకుల యానందమునకు ముఖ్యముగఁ గారణ మైనను, ఆయానందము వారి మనస్సులలో నిత్యముగ నుండునట్లు చేయుటయు నాకవులకు గొప్ప పూచీ నై యున్నది. ఆకని యధికగుణనాయక కథాశ్రయణము గల కావ్యములవలనఁ గాని యలవడదు. జన్మవిశుద్ధ పూర్వోక్తసుగుణములు గొన్ని ప్రకృతచమత్కారరూపకార్యముపట్ల వినియోగపడినను బడకున్నను గథాపర్యవసానమున హెచ్చుగ నాగుణములు గలనాయకాశ్రయకథా భాగములవలననే చదువరులకు హృదయద్రావణము గలుగుచుండును గాన నవి కవులచే బొత్తుగ మఱువఁ దగవు. మఱియుఁ బురాణాదులనుండి యుద్ధృతములగు నుత్తమనాయకాశ్రయకథాభాగముల నుపజీవించి పిమ్మటి కవులు మరల వ్రాయుటలో, లోకోత్తర రసభావ గుణాలంకారాదికావ్యాత్మస్వభావస్వామ్య వాదులను సంతరించుటతోపాటు కథానాయకుల సౌభాగ్యాదివర్ణనలు మాత్రము గాక వారి కష్టకాలికసమాచరితములును బ్రధానములుగు దేశక్షేమోద్దేశ్యకోపదేశదానక్షమోత్తమచరితములును గూడ సమకూర్చుట మఱువరాదు. సువర్ణముయొక్క మంచిచెడుగులు కషణోపలదీప్తాగ్నులవలన వలె నుత్తమవ్యక్తిధారణమువలనఁ బ్రస్ఫుటములు గానట్లు నాయకగుణదోషములును నాయక దుఃఖకారణవిప్రలంభాది కాలికసమాచరితములవలన వలె నాయకానందకారణ సంయోగాదికాలికసమాచరితములవలనఁ బ్రస్ఫుటములు గానేరవు. వానినిబట్టియే యాకావ్యములకును శోభోత్పత్తిగాన నాకావ్యములలో నా నాయికానాయకుల విప్రలంభాదులు దప్పక వర్ణింపవలయును. కనుకనే పూర్వపుఁ గావ్యనాటకములు

హెచ్చుగ రామాద్యుత్తమనాయకాశ్రయకథలు గలవిగను, వారి కష్ట కాలికచరితములు గలవిగను నిర్మింపఁబడినవి. ఇట్లంతట సదుపదేశకోటి కమును, రసభావాద్యలంకారికసమయసంప్రాప్తసామగ్రీసంభావితము నగు నుత్తమకావ్యమును నిర్మించుటను బోధింపనే ప్రాచీనులగు లక్ష్య లక్షణవేత్తలు బహువిధములఁ బాటుపడుచుండిరి. కనుక "నానృషిః కురుతే కావ్య"మ్మను నభియుక్తోక్తినిబట్టి జన్మాంతరకృతపుణ్యకర్మవశ మున నలవడిన యతిప్రాసాదిశబ్దాలంకారసంయోజననైపుణి గలకవి సోదరులును, దూరాన్వయము మొదలగు భావకహృదయవైరస్యోత్పా దనకారణక్లిష్టతలు లేకుండ గద్యములను సమముగ నడిపింపఁగల చతురులును, సరళమగు తమయాశయమును మృదుశబ్దములమూలమున నిర్మల పర హృదయములయందు ఛాయాచిత్రకారుఁ డుత్తమదృశ్య మును స్వచ్ఛాదర్శములమూలమున శుభ్రపత్రములందువలెఁ బ్రతిబిం బింపఁజేయ నేర్పరులై, దమ తమ యుత్తమసామర్థ్యములను జిరకా లము జనులు గొనియాడునటులఁ జేయఁ గడంగినచో నపు డీవసుంధరా రమణి, యీవఱకే నిరంతరము ననశ్వరనిర్మలకీర్తికాయు లగుకాళి దాసాదులవంటి నిర్జరకవితనయులను గని యున్నది కాకపోవునా? పరోపకారార్థజన్మ మయినదియు, వప్రక్రీడాపరిణత గజప్రేక్షణీయ మయినదియు నగు నాషాఢప్రథమదివసీయమేచకమేఘము, నీలవర్ణ మును గగనమార్గసంచరణమును గలిగిన దని నిర్ధన నిర్జన నిష్ప్రాకాంత శోభములై దారిద్ర్యదేవత నారాధింపఁదగు ఛిద్రగృహముల మూలల నివసించునసద, మసటు, గబ్బిలములతో సరిఁజేయ యత్నించుట ప్రాయున కాని యూహాచాపలమును వెల్లడించును గాని బిరుదవదుపరుల మెదడముల నావర్జింపఁ జాలునా? కనుక వినుటతోడనే పాఠకమాన సాకర్షణపటుశబ్దార్థాలంకారాది కావ్యశరీరశోభాకారణముల నలవఱచు కొనుట మాత్రము కావ్యకరణప్రధానోద్దేశ్యము కాఁగూడ దనియు, సప్రధానములగు నవ్వానితోఁ గూడిన యుత్తమనాయక చరిత్రోల్లే

ఖన స్ఫురణములు ప్రధానములుగ నుండవలయు ననియుఁ గవివరులు గ్రహించుకొనవలసి యుండును.

వాస్తవముగఁ గవికిఁ గావ్యకరణమునకుఁ బ్రతిభ యొక్కటియే కలిగినఁ జాలును. దానిమూలమునఁ గవి యెట్టికథ నైనను రసవత్తరముగ వసంతర్తువు ప్రాణమాత్రావశిష్టతరుస్కంధములను బల్లవింపఁ జేసి సర్వతోముఖ రమణీయత గలదిగఁ జేసినట్లు చేయఁగలఁడు. కాళిదాసుని మేఘదూత కావ్యమునందుఁ గథ యేది? ఏపురాణమునుండి యుద్ధృతమైనది? అందలి కవినైపుణ్యమునకు మెచ్చుకొనుచు రిచ్చపాటొదవని వారెవరు? కనుకనే కవియందు నీశ్వరత్వమాపాదించుట లోకసముదాచార మయినది. చూడుఁడు.

"నియతికృతనియమరహితాం,
హ్లాదైకమయీ మనన్యపరతంత్రామ్,
నవరసరుచిరాం నిర్మితి
మాదధతీ భారతీ కవేర్జయతి"

యను నీకావ్యప్రకాశ ప్రథమశ్లోకము కవిభారతిని బ్రహ్మగా నుపశ్లోకించు చున్నది. కాని పైన నేను వర్ణించినట్లుఁ గవియుద్దేశ్యములు లేనిచో నపుడా కావ్యములు, ప్రాతఃకాలమునఁ దృణాగ్రావస్థితహిమబిందువులు గొంచెము సేపు సూర్యకాంతిని సమున్మిషితములై రతనముల తునకలవలెఁ గనుపట్టి చివరఁ దమంత తాముగాని స్వల్పాన్య కారణమునఁగాని స్థానభ్రంశము నొంది భూమిపై నెచటఁబడి యే మయినది తెలియకుండ రూపుమాయు నట్లు స్వరూపనాశన మొందఁ గలవు. కనుక నట్టిది కాకుండుటకై కవి సర్వవిధముల నాయత్తపడవలయును. అందుచేతనే కాళిదాసాది మహాకవులు హెచ్చుగ మహాభారతాదుల నుండి యుత్తమనాయకచరితముల నుద్ధరించుకొనిరి. కనుకనే యాకావ్యములు నిప్పటివఱకుఁ నిలుచుటకుఁ గారణ మయినది. అట్టి మహాకవులలోఁ గాళిదాసు సర్వోత్తమకవయిత యని మన భారతదేశపండితుల చేతను

ఇతరదేశ పండితులచేతను గూడ ననేకవిధములఁ గొనియాడఁ బడిన వాఁడు. అతఁడు మూఁడు శ్రవ్యకావ్యములను మూఁడు దృశ్యకావ్యములను సంతరించి యఖండకీర్తిని లోకమున వ్యాపింపఁజేసి స్వర్గలోకమున నిరంతరసుఖము ననుభవించుచున్నాఁడు. ఆకవివర్యుఁడు క్రీస్తునకుఁ బూర్వుఁడగు చంద్రగుప్తాపర నామక, విక్రమార్కుని యాస్థానవిద్వాంసుఁడై యారాజుమన్ననల నందినవాఁడు. దీనికి నిదర్శనము.

"ధన్వంతరి, క్షపణకా, మరసింహ, శంకు,
వేతాళభట్ట, ఘటకర్పర, కాళిదాసాః,
ఖ్యాతో వరాహమిహిరో నృపతే స్సభాయాం
రత్నాని వై వరరుచి ర్నవ విక్రమస్య"

అను ప్రాచీనశ్లోకము. ఈశ్లోకమునకుఁ బాఠభేదములు నన్వయభేదములును వ్యతిరేకార్థాన్యశ్లోకములను వేనవేలు లేకపోలేదు. మఱియు నేతద్వ్యతిరిక్తకాలికుఁడని కూడ వాదములు లేకపోలేదు. ఆ వాదముల నన్నిటిని నా కాళిదాసకాలనిర్ణయసాధనమునుబట్టి యువ్వెత్తుగ ద్రోసివేయవచ్చునని నే నూహించుచున్నాఁడను. సవిమర్శపాఠకులు నా యీచాపలమునుగని క్షమింతురు గాక.

ఛందోదర్పణసమీక్ష.

రావూరి దొరసామి శర్మకవి.

అనంతామాత్యకృతమగు ఛందమునకు ఛందోదర్పణమని, యనంతునిఛందమని రెండుపేరులు గలవు. అట్లున్నను గొందఱు అవి భిన్నములని భ్రమించుచున్నారు. అప్పకవీయమునఁ బూర్వగ్రంథనామసంగ్రహవచనమున 'అనంతామాత్యచ్ఛందంబును, ఛందోదర్పణంబును' అని పృథక్కుగా లిఖింపఁబడియున్నది ఇది లేఖకప్రమాద జనితంబు గానోపును ఇవి రెం డొకటియేయని యెఱుంగవలయు.

అనంతామాత్యునిచరిత్ర యాంధ్రకవులచరిత్ర మున్నగు గ్రంథంబులఁ జర్చింపఁబడి యున్నది. అనంతుఁడు 15 వ శతాబ్దమధ్యమునందలి లాక్షణికకవి. ఇతఁడు భోజరాజీయము, ఛందోదర్పణము, రసాభరణము ననుకృతిత్రయము రచియించెను. ఛందోదర్పణోపోద్ఘాతంబున నొకరు రసార్ణవ మనిరి. రసాభరణమున కది నామాంతర మగునేమొ తెలియరాదు. ఛందోదర్పణమునకు విపులమైన యుపోద్ఘాతమును శ్రీగిడుగు వేంకటసీతాపతిగారు విరచించిరి. అందు వారు వివిధవిషయంబులవిస్తారంబు విమర్శించి యున్నారు, కాని నాకు మఱి కొన్నియంశంబులు స్ఫురించుటచే వానిని బ్రకటించుటే యీవ్యాసరచనకు ముఖ్యోద్దేశము.

ప్రథమాశ్వాసము:-

1. గురులఘుచిహ్నవివరణమందు 'లఘువు దనరును హరి యొక్కరుఁడ పరతత్త్వ మనుచును సురుచిరముగఁ జుట్టి వ్రేలఁ జూపిన మాడ్కి' అని యింతదీర్ఘముగా శిరోవేష్టనప్రాణాయామమువంటి వివరణ మేలకో. 'ధరపై లఘువులు వెలయుఁ గరిమ న్నిడుగీటు వ్రాయుకరణి ముకుందా'యని యెంతసులభముగా సులక్షణసారమునఁ గలదో కదా!

౨. త్రిప్రాసము.

'అత్రివిక్రముఁ డభయప్రదాత యనఁగ
వాక్త్రిపథగోజ్జ్వలులు విష్ణుభక్తు లనఁగ.'

అనునుదాహరణముల నొసఁగుచు ననంతుఁడు త్రికారమునకు తకారమునకుఁ బ్రాస మన్నాఁడు. ఇకారవిశిష్టత్రకారమునకు మాత్రమే యీప్రాసము చెల్లు ననియుఁ దదితరములకుఁ బొసఁగ దనియు నర్థ మగుచున్నది. 'సంఖ్యఁ జెలఁగు త్రికారంబు జనుఁ దకారసదృశమై త్రికారప్రాససంజ్ఞ గలిగి' యని స్పష్టముగా త్రికారమే పేర్కొనఁబడియున్నది.

ఇందులకు అప్పకవీయమున సంయుతాసంయుతప్రాస సందర్భములో-

'రలలు తమక్రింద జడ్డలై క్రాలువ్రాలు
ప్రాసవర్ణంబులై వానిఁ బాసియైనఁ
గూడియైనను బెఱయుడుగులను నిలుచు
సంయుతాసంయుతప్రాససంజ్ఞఁ బనరి'

అని కలదు. భారతము-ఆదిపర్వము.

ఉ. క్షత్రియవంశ్యులై ధరణిఁ గావఁగఁ బుట్టినవారు బ్రాహ్మణ
క్షత్రియవైశ్యశూద్రు లనఁగాఁ దగు నాలుగుజాతులన్ స్వచా
రిత్రముఁ దప్పకుండఁగఁ బరీక్షితుఁ గాచినయట్లు రామమాం
ధాతృ రఘుక్షితీశులు ముదంబునఁ గాచిరె యేయుగంబులన్.

పై పద్యమున త్రికారమునకే కాక త్రకారమునకును బ్రాసమైత్రి గలదు.

మఱియు నట్టిదే యీక్రిందిపద్యము. సోమునిహరివంశము.

శా. నాతో మార్కొనలేరు నిర్జరపురీ నాగేంద్రబృందారకా
రాతు లున్నన్నఁ దేవసంఘములు పోర స్థిరసంగ్రామకుం

డీత్రైలోక్యమునందుఁ గల్గుకు రణం బెచ్చోట లేకుండఁగాఁ
జేతు ల్వేయు వృథాభరం 'బగుచు వచ్చె న్దైవ యామీనికిన్.

ఇందు త్రైకారమునకు' తకారప్రాసముగలదు.

భాస్కరరామాయణము (యుద్ధకాండము-1556. ప.)

౨. నాకన్నులయెదురంబడి
యేక్రియ మెయిమెయిన బ్రదికి యేఁగడు నింకన్... ...

త్రికారత్రకారములకే కాక యుభ్యకవి నడిచినపఋవున రేఫశ్లిష్టశబ్దములకెల్ల ననంయుతంబుగాఁ బ్రాసంబుఁ గూర్పవచ్చు నని స్పష్టపడియెను. అనంతుఁడు తనకుఁ బూర్వకవులు ప్రయోగించిన యీప్రాసరీతులనేని గమనింపక త్రిప్రాస మని క్రొత్తగా రచించుట యవిచారమూలకమ యగును.

3. సమప్రాసము.

అయుపేంద్రుని బొడఁగాంచు టయుపాయ
మనెను దీర్ఘాదు లచట హ్రస్వాదు లయిన
నయ్యుపేంద్రుని బొడఁగాంచు టయ్యుపాయ
మన సమప్రాస మగు నూఁదఁ జనదు రహల.

అ+ఉపేంద్ర=అయ్యుపేంద్ర-త్రికసంధి; ఋకారము నూష్మరేఫలు పరం బగునపుడు త్రికంబునకు హ్రస్వము, పరమైనవర్ణమునకు ద్విత్వము సంభవింపదు. ఇందు రహలు మాత్రమే గ్రహించి తక్కినవి (ఋ-శ-ష-స) విడుచుటకుఁ గారణ మేమియో గోచరింపలేదు.

4. బిందుప్రాసము-

పేర్చి పొల్లుఁగారంబు బిందు వగుచు
మీఁద నున్న ధకారంబు నూఁదఁ బ్రాస
బంధ మగుఁ గృష్ణుఁ డుదయించినం ధరిత్రి
యంతయును నిరుపద్రవం బయ్యె ననఁగ.

ఇందు సహజ బిందుపూర్వక ధకారమునకు బ్రతియోగసాధ్య పూర్ణబిందుపూర్వక ధకారమునకుఁ బ్రాసమైత్రి చెల్లు నని చెప్పఁబడియె. ఇట్లనుటచే నితరములకుఁ జెల్ల దనియు దీనికే ప్రత్యేకత కలదనియుఁ దాత్పర్యమగును. "బిందుం ప్రవదంతి తం క్వచి త్కేచి" త్తను చింతామణిసూత్రములోని క్వచిచ్ఛబ్దమువలన వర్గయుక్కులు పరంబగునపుడును బూర్ణబిందు వగును.

కవిసింగరన్న త్రైశంకవోపాఖ్యానము-

క. ఢుంఢీశు భైరవుని శితి
కంఠు విశాలాక్షిఁ దండకరు జాహ్నవి నై
కుంఠపతి గుహుని లోలా
ర్కుం దేవలు మీఱి భావరుఁడు పొడగని మ్రొక్కెన్.

అథర్వణాచార్యుల విరాటపర్వము-

ఢం ఢమిత భేరికాధ్వానముం ఢుళీనినాదమును ......

అనుప్రయోగము లప్పకవీయమందుఁ జూపఁబడినవి. ఇట్లుండ నొకధకారమునకే చెప్పుట వింత.

5. అర్ధబిందుప్రాసము-

సార్ధబిందువులై తేలినట్టిపటల
కరయఁ బ్రాసంబు నిర్బిందువైనఁ జెల్లు
వీఁపు మూఁపులు మఱితలమోపు లయ్యె
మాట లేటికి మేటితాఁ బేఁటి కనఁగ.

ఇందు పటలకు మాత్రమే ఖండాఖండబిందుప్రాస చెల్లు నని యనంతుఁడు వచించుట యబ్బురంబుగాఁ గన్పట్టెడి. పరుషసరళపరకములైన యర్ధబిందులన్నిటికి బ్రాస చెల్లు నని యీక్రింది ప్రయోగములు దెల్పెదు.

విరాటపర్వమున.

లోకము వంచింపఁగఁ దగు
చీఁకటికే యొదవె నేమి సేయుదొ చెపుమా.

ఆదిపర్వమున.

తీఁగయుయ్యెల నూఁగుఁ జల్లనితియ్యమామిడిమోకలం
డాఁగుఁ బువ్వులతేనె సోనలఁ దారుఁ గేలికిఁ జేరుఁ బు
న్నాగ పూగ మహాగ వీథుల నాట్యముల్పచరించు నా
భోగ నాగలతాగృహంబుల భోగముల్గనువేడుకన్,

వరాహపురాణమున.

ఆచింతామణి మునితన
పీఁచ మడఁచు దాఁకనీక పృథులోభముచే.

శాంతిపర్వమున.

నేతెరువునఁ జరియించుచు
నేతెఱఁగున నైనఁ దప్పనేనియుఁ బురుషుం
డాతతనాకసుఖముగనుఁ
దోఁతెంచును మగుడ సద్బుధులవంశమునన్.

భాస్కరరామాయణము సుందరకాండమున.

బాఁతిగ నిడ గ్రైవేయక
మై తోఁచెడు నాకు నాద్యప్రాణేశుఁడున్.

నృసింహపురాణమున.

ఆదియు మహిమయు నేర్పడ
నాదిపురుషుఁ డొకఁడ యెఱుఁగ నన్యుల కెఱుఁగం
గాఁ దరము గాదు కమలభ
వాది దివిజవంద్య మది మహాద్భుతము మహిన్.

వీని ననుసరించియే యప్పకవి.

'నిడుపులు నరసున్నలు దమ
కడమనుగల కచటతపల కిలఁ బ్రాసములై

దోడరును నిర్బిందువు లో
కూడ ఖండాఖండసంజ్ఞ నిఃశశినయనా'
అని రచించెను.

ఇది యిట్లుండనిండు; మఱియొకయంశము. పటల కుదాహరణమునఁ జతుర్థపాదమున 'తాఁబేఁటికి' అనుచోట టవర్ణపూర్వ మర్ధబిందు వుండనగుఁగాని తాఁబేలు శబ్దంబునకుఁ బరం బయిన యాపవిభక్తికంబగు టవర్గమునకుఁ బూర్వ మర్ధబిందు వుండ దని వ్యాకరణము లుద్ఘోషించుచున్నవి. ఈప్రయోగం బనుసరించి చూడ నర్ధబిందువుగూడ నుండవలెనని తోఁచెను.

6. ఉభయప్రాసము. దీనికే యక్కవి సంయుతాసంయుతప్రాసమనియు. లకారరేఫశ్లిష్టములగు డకారములు సంయుతముఁ బాసియుఁ బ్రాసమై త్రింబారయు నని దీని కర్థము.

పాఁడి మరగి బ్రతుకువాం డ్రిల బ్రేఁతలు
వాండ్రవెన్న లేలఁ దండ్రి! యనఁటి
పండుకొఱకు వింతయిండ్లకుఁ బోదు కృ
ష్ణుండు నీకు బ్రాఁతె పండ్లు నిచట.

ఇట్టిప్రయోగములు కవిత్రయాది ప్రామాణికకవులగ్రంథంబులం దెందును గానరా కున్నవి; అప్పకవియు నిది చెప్పినాఁడు; అనంతుఁడిది గాక దీని వెనుక నీక్రిందిపద్యము వ్రాసెను.

రలయుతాయుత ప్రాసమార్గముఁ దలంచి
వాండ్ల తేఁజాపుమోములఁ దీండ్ర మారె
ననుచు రెంటను గూర్చిన ననవుఁ దప్పఁ
దండ్రు నిఖిలార్థవిదులైన దండికవులు.

పాఁడి-వాండ్రు, పండు-ఇండ్లు ఇట్టిప్రాసమే యనుమగనుండ డ్రడ్ల ప్రాసము చెల్ల దని యేదండికవులు చెప్పిదరో.

7. సంధిగత ప్రాసము.

ధ్రువముగ సంధిజనిత రూ
ప విశేషప్రాస మనఁగఁ బరఁగు వకారం
బవిరళ వకారమగు న
య్యా వదాఱవపా లెఱుంగ నసఁగ ముకుందా.

ఇట్లనుటచేఁ గళలమీఁది వకారంబునకుఁ బ్రాసస్థానంబున వకారాదేశము నిత్యమని తేలుచున్నది. కవిలోకచింతామణి కర్తయు నిట్టి యభిప్రాయమునే తెలిపెను. సంధిగతప్రాస మనఁగా సంధివశమున నేర్పడిన యాగమాదేశవర్ణములు ప్రాసస్థానంబున నున్నవానికి మైత్రింగూర్చుట; వకారమునకు మాత్రమే యనుటగాదు. అప్పకవీయమునఁ జూడుఁడు.

సంధిఁ గూడిన వ్రాలు ప్రాసంబులైన;
నవియె సంధిగతాఖ్యల నమరుచుండు,
దివిజు లాశ్చర్యమొంద శౌరి వడనైచెఁ,
జెంగిపోనీక మధురలోనం గరిమున.

అనంతుఁడు దీనిపైఁ గళాద్రుతసంధులు సూత్రించి యందుల కుదాహరణముగా నిచ్చిన.

'వాఁడు గను వాఁడు నేకొను వాఁడు డెక్క-
లాఁడు వాఁడు దపోనిధి వాఁడు పెద్ద'

అను పద్యభాగమున 'వాఁడు + తపోనిధి' యనుచో దకారాదేశము వచ్చుట తటస్థించుచున్నది. 'నవికృతిశబ్దాత్పరత స్సాంస్కృతికానాం భవంతి గసడదవాః' అను నాంధ్రశబ్దచింతామణి సూత్ర ముండియు నిటు వ్రాయుటకుఁ గారణంబు శోచనీయము. 'అది మొదలుగాఁగ కృష్ణుని మది నిల్పి యంతంకు నాకు మఱఁ డగునని యిట్లు దపంబు సేయుచుండెద' నను నిర్వచనోత్తరరామాయణప్రయోగము ననుసరించి యుదాహరించి యుండునేమో. అందు తపశ్శబ్దభవము తబ మనియూ

'ఇట్లు దబంబు సేయుచుండెద' నని పఠించిన నిర్బాధకం బగు నని యందురు. అట్టిమార్పున నిచ్చోటఁ బొసఁగ నేరదు.

(౮) అచ్చుమీఁ దచ్చున యకార మాయజంపు

కొమ్ముగలవాల్లు ప్రథమైనఁ గ్రుంకున చ్చు (63 వ పద్యము)

అచ్చుమీఁది + అచ్చు — ఇందు సంధినిషేధముగా నుండవలయును గాని వైకల్పికంబుగా భావింపవలసి యున్నది. 'ప్రథమ + ఐన' అనుచోటఁ దత్సమంబునకుఁ బరంబైన యచ్చునకు నిషేధము విహితం బయ్యు సంధిఘటన నవీనంబు గాఁ దోఁచదు. 'ఏవార్థకస్య సంబోధనస్య చాతో న సర్వత్ర స్త్రీవాచకసమనామ్నోః కవిత్రయకృతౌ న దృశ్యతే సంధిః' అను కారికాసూత్రముచేఁ దత్సమములకు సంధి కవిత్రయాది లాక్షణిక కవులమతము గా దనుట స్పష్టము. కాని యాధునికగ్రంథంబులందుఁ దత్సమములకు సంధి గోచరించెడు; అందుచేతనే కాఁబోలు 'క్వచిత్సంస్కృతిమో ఽపి ప్రాణో క్వచిత్ చ్యుతో భవే' త్తనియుఁ జెప్పఁబడినది. మనయనంతుఁడు నథర్వణుఁడు 'క్వచిత్సంస్కృతిమో పి' అనుట ననుసరించి యుండవలయు, లేకున్న నిట్టిప్రయోగంబునకుశరణం బుండదు.

(9) ఈత్రికారంబుకుఁ దృతీయ మెసఁగఁ గ్రింది — 46 వ పద్యము.

ఇందు షష్ఠీవిభక్తి కువర్ణకము పరంబగునపుడు నగాగమము నిత్యముగావచ్చి త్రికారంబునకు నని యుండవలయుఁగాని, నగాగమము సేర్చిన గణభంగంబు సంభవించును. 'నః కౌ' అని చింతామణి. కొందఱు భారతమున సభాపర్వమున 'సహదేవ నకుల వాసవసుత భీములఁ గ్రమమున నలువురఁ గౌరవేంద్రు కొక్కొక్క యేటున నక్కువంబున నొడ్డి యోడి తన్నును నొడ్డియోటువడిన' నను ప్రయోగము కల దందురు. కౌరవేంద్రు నొక్కొక్క, కౌరవేంద్రుఁ డొక్కొక్క యను పాఠాంతరములును గనఁబడుచున్నవి. భారతవిషయము సందిగ్ధముగా నున్నను

అనంతునికిఁ బూర్వకవులు నగాగమవిరహితముగా వాడియున్నారు చూడుఁడు. “కమలాసన విను నావిక్రమమునకు వెలపెట్ట దేని”—నిర్వచనోత్తరరామాయణము,

సంగరమునకు నుత్సవము సేఁగెదు క్రియ — ఉత్తరహరివంశము,

రామాయణము ప్రచించి ప్రాచేతసుకున్-భాస్కరరామాయణము,

ఒక కోమటికి న్నిషధేంద్రు బచ్చుకున్-నైషధము.

చిన్నకోటపెద్దన విభక్తిప్రత్యయములు సేర్చుట కుదాహరణములు సెప్పిన పద్యమునందు ‘సుతుచేత సుతునిచేతను సుతుకొఱకును సుతునికొఱకు సుతువలనన్ దత్సుతునివలన సుతుకొదవును సుతునికొదవు సుతునియందు సుతునందనఁగన్’ (కావ్యాలంకారచూడామణి. ౯. ఉల్లాస. ౧౧౦) అని స్పష్టముగా నగాగమంబు లేమియుఁ జేర్కొన్నాఁడు. మీఁదుమిక్కిలి మనయనంతామాత్యుఁడే తొలుతఁ దా రచించిన భోజరాజీయమున ‘బలవంతపుఁబాపము దెచ్చుకొంటివేలా నగుఁబాటు కోర్చి’యని నగాగమవిరహితముగాఁ బ్రయోగించి యున్నాఁడు, గాన నిందు నగాగమము విభాష నగు ననియే గ్రహింపవలయు.

10 స్వరప్లుతోభయ వృద్ధ్యనుస్వర వికల్ప- 81 పద్యము.

ఇందు సంయుక్తపుతవర్ణంబునకుఁ బూర్వరేఫము గురువు కావలసి యుండియు లఘువుగా రచింపఁబడి యున్నది. ఇది ప్రక్షిప్తమందురు; ఇది యెందులకుఁ బ్రక్షిప్తమగునో క్రింద వివరింపఁబడును. ఇట్టి లాక్షణికమతవిరుద్ధంబగు నభిప్రాయము ననంతుఁడు మఱియొకచోట స్పష్టముగా వక్కాణించి యున్నాఁడు.

ద్విత్వమున కాదివర్ణంబు తెఱఁగునందు
నూఁదకుండును వలసిన నూఁదియుండు
జానకీవల్లభుఁడు క్షమాశాలి యనఁగ
దశరథాత్మజుఁడు స్వామి ధాత్రి కనఁగ.

ఆంధ్రమున వ్యస్తపదములందుఁ బదాదిసంయుక్తమువలనఁ బూర్వపదాంతవర్ణము గురువు గాఁజాల దని యుండ ననంతునిపై పద్యము వింతలలో నొకండుగాఁ గన్పట్టెడి.

11. యతులు.

అనంతుఁ డిరువదినాల్గుయతులు వ్రాసిన ట్లప్పకవి 'భీమన పది చెప్పె ననంతామాత్యుఁడు చేసె వెనుక యతు లిరువదినాల్గు' అనుపద్యమునఁ జెప్పెను. ఛందోదర్పణమునఁ బరిశీలింపఁగా నిరువదినాల్గు యతు లున్నవిగాని యంతకుముం దున్న యతిభేద వివరణ పద్యములం దర్థము దురవగాహంబుగా ననన్వయంబుగా నున్నది.

74. పద్య.

స్వరయతులు వర్గయతులును
సరసయతుల్ ప్రకట మైన సంయుక్తయతుల్
పొరిఁ బ్రత్యేకయతులు ననఁ
బరఁగును యతిపంచకంబు పంకజనాభా.

ఇందు యతు లేనువిధంబు లని చెప్పి తద్భేదంబు లిట్లు చెప్పినాఁడు.

స్వరయతులు ప్రాది కాకు
స్వర నిత్యసమాస యతులు వర్గయతులు ని
ద్ధరఁ బోలికవడి సంయుత
విరతి యనుస్వారయతులు వెలయు ముకుందా.

80. పద్య.

ప్రభునామాంతవిరతి యన
విభాగవిరమణమును భిన్నవిశ్రమమును గా
స్తుభధర వికల్పయతి యన
నభేద విరమణ మనంగ నైదు తెలుంగుల్.

81. పద్య.

స్వరప్లుతోభయ వృద్ధ్యనుస్వార వికల్ప
ప్రాద్యభేద సంయుత భిన్న ప్రభు విభాగ
కాకుమాదేశ నిత్యాద్యఖండవర్గ
చక్కటెక్కటి పోలిక సరసయతులు.

పై 78, 79, 80 పద్యములం జేర్కొనంబడినయతు లుండుటచేతను, మొత్తము యతు లిరువదిరెం డగుటచేతను 81 పద్యము పై పద్య విభాగమునకు సంబంధించినది కాకుంటయే కాక, యిరువదినాల్గు యతు లన్న యప్పకవివాక్యమునకు భంగము తటస్థించును గాన నిది ప్రక్షిప్తమే యగును. మీఁదుమిక్కిలి యిందు (81 పద్యమున) నుక్తం బగు ప్లుత, ఉభయ, వృద్ధి, అఖండ, చక్కటియతులు ప్రత్యేకముగా ఛందోదర్పణమునఁ గానరావు. ఉభయవళియందుఁ బ్లుతాఖండములు చేరును. ప్లుతము కాకుస్వరయతియందుఁ జేర్చినాఁ డనంతుఁడు. వేఱె యింక నుభయాఖండములఁ జేర్కొనవలసినయావశ్యకత లేదు. వృద్ధియతి ననంతుఁడు చెప్పలేదు. ఇఁకఁ జక్కటియతి యనఁగా విభక్తివర్ణమునకే కాక శృంగసహితమకారమునకు పుఫబభలు యతిమైత్రి నొందు ననుట. ఇది సులక్షణసారమునఁ జేర్కొనఁబడినది గాని యనంతుని పోలికవడి యందే యిది గ్రాహ్యము కాఁగలదు.

ప్రకృతము 81 పద్యము ప్రక్షిప్త మని నిశ్చయింపఁబడుటచే దానిం దొలగించి తక్కినపద్యములం గూర్చి చర్చింతము. అం దిరువది నాలుగు యతిభేదములు లేకున్నను 'స్థితస్య గతి శ్చింతనీయా' యనుట ననుసరించి నాయభిప్రాయంబును దెలిపెదను.

యతిపంచకభేదములు :—

అ. స్వరయతులు - ప్రాది, కాకుస్వరము, నిత్యసమాసము. స్వరయతు లనుమాటలోనే గూఢస్వరము, ఋకారస్వరము, రీవిరమము, ఋవళి,

అను నాలుగుయతులు గ్రాహ్యక మగును; నిత్యసమాసయతిచే నిత్య యతి గ్రహింపవలె, అప్పుడు మొత్తము స్వరయతిలోఁ జేరి 9 అగును.

ఆ. వర్గయతి - పోలికవడి -2

ఇ. సరసయతి -1

ఈ. సంయుక్తయతి - అనుస్వారయతి; ఇందులోనివి రెండు గాక తద్భవ వ్యాజయతి, రేఫయుతయతి, మకారయతియును 3 కలసి 5 యతు లగును.

ఉ. ప్రత్యేకయతిక్రింద ప్రభునామాంతవిరతి, విభాగవిరమణము, భిన్న విశ్రమము, వికల్పయతి, అభేదవిరమణ మని 5 విధములు. భిన్న విరతివంటిది దియతి, వికల్పముచే యుక్తవికల్పము గ్రాహ్యము. మొత్తము యతులు 7 అగును. ప్రత్యేకయతికే యొక్కటియతి య నియుఁ జేసిగాన దానిం గలుపుకొన్న 8 యతులగు.

ఈ ప్రకారముగా యోజించిన 25 యతు లగుచున్నవి గాని దియతి యని ప్రత్యేకముగాఁ జెప్పఁబడక భిన్నయతియందే మూలమున నుంటచే 24 కాఁగలవు.

అట ఇకారాంతపదము మీఁదటి దికార
మది యనంగ నవ్వల భిన్నయతికిఁ జెల్లు
దివిజవిభవంబు శౌరిచేతి దియనంగ
నసుర నాశంబు హరిచేతి యది యనంగ. (123 పద్య)

12. ఋకారస్వయతి-

తెల్లముగ ఋకారము యణాదేశశక్తిఁ
గలుగు రేఫయుత్వమునందుఁ గదిసి యతికి
నట్టికి నీమేలతో నన్వయించు
నట్టి సత్వంబు లే దది హల్లుగాన

"ఇకోయణచి" సూత్రమువలన ఋకారమునకు యణ్ణగు రేఫము గలుగును. అది యిత్వముతోఁ జేరియుంట కుదాహరణము— పితృ + ఈప్సితము=పిత్రీప్సితము; ఇందు రీ యున్నది; దీనికి ఈయేలలో

యతి పొసంగ దని పైపద్యము భావము. ఏల యతి యొస్వయింపదో తెలియలేదు. తప్పక యతిచెల్లునట్టి సత్త్వంబుగలదు. ఈపద్యమునకు వేఱొండర్థము గలదేమో ?

12. ఌకారయతి-

మును ఋకార మిూఁదేలతో నొనరి నట్లు
చేర దొకట యణాదేశ కారణమున
ఘనలకారంబ యగును ఌకార విరతి
క్లృప్తిలేదు శౌఁగుణావళికి ననంగ.

ఋవలెనె ఇ ఈ ఎ ఏ లంగూడ నలళలకు చెల్లును. మఱియు ఋ- ఇఈ ఎఏలకుం గూడఁ జెల్లుచు, ఇది ఌకారమునకవి చెల్ల వని పైపద్యము భావము. దీనికిఁ గారణము శోచనీయము.

సీ. వినవయ్య కృతవీర్యుఁ డనుజనపతి తొల్లి...
అతనివంశమునవా రతిధనలుబ్ధులై
కృతవీర్యధనమెల్లఁ గ్లృప్తిసేసి (భారతము - ఆదిపర్వము - ౭. ఆశ్వాసము-133 పద్యము.)

పై నన్నయప్రయోగమున ఋఌలకు యతిమైత్రి హాల్యంబో గమునఁ జూపఁబడినది. దీని ననంతుఁడు పరిశీలింప కుండును గాఁబోలు! ఇట్లు ఋకారమునకు ఇఈ ఎఏలకు యతిని మిత్రత్వ మందఁగల దని నాయాశయము. ఈవిషయంబును గూర్చి యప్పకవి యేమియుఁ జెప్పఁ డయ్యెను. అనంతుని ఌవళింగాని నన్నయప్రయోగమునుగాని యతఁడు చూడలేదేమో.

14. రేఫయుతయతి-

ఆంధ్రలిపిఁ జొప్పడదు ఋకారాన్వితంబు
శ్రోత్రగాదు కృష్ణుని వక్త్రముచ్చి మనఁగ
స్రుక్కఁ దతఁ డాజి నెట్టిరిపోధి నైనఁ
గ్రమ్మ నన రేఫయుతయతి గూడఁ గాన.

తెలుఁగున ఋకార ముండ దనియు మ్రుచ్చిమి స్రుక్కు క్రుమ్ము మున్నగుపదములు రేఫయుతములే కాని ఋకారాన్వితంబులు గా వని పై పద్యమున కర్థము. ఇది యతి యెట్లు కాఁగలదు? ఇట్టిస్థలములందు రేఫమైత్త్రిని బాటింపవలయునే కాని ఋత్వ మని భ్రమింపరా దని రేఫమైత్త్రి నుదాహరణముగాఁ జూపి యనంతుఁ డిసిరియొక యతిగా గణించెను. "పదాద్యంబులు ఋగ్వర్ణంబులు రలతుల్యంబు" లనుటచేఁ దెలుఁగున ఋౠలు రురూలతో సమములై యుంటచే వానికి యతి మైత్త్రి నిషేధ మనుటకే యిది పృథక్కుగా వ్రాయుటకు హేతువై యుండును. ఇట్లు దెలియక కొందఱు కవులు ఋకారరేఫసంశ్లేషములకు యతిమైత్త్రి నుంచియున్నారు.

భాస్కరరామాయణమున నయ్యలార్యకృతయుద్ధకాండశేషము నందు- క్షురార్ధచంద్రాస్త్రకృత్తోరుబాహులై (1448 పద్యము.)

ఇట్టిప్రయోగము దనకు ముం దుండుటచేతనే యనంతుఁడు రేఫయుతయతిని జేర్చియున్నాఁడు. శ్రీ గిడుగు వేంకట సీతాపతిగారిది యొకయతి భేదముగా నుండదని యభిప్రాయపడి ఋయతిని బృథక్కుగాఁ గ్రహించిరి. మూలమున రేఫయుతయతి యని యున్నది గాని, ఋయతి యని చెప్పఁబడక భిన్నయతి యందుఁ జేర్పఁబడినది (చూ-ఇందు 11-ఉ.) కాన ఋయతినిఁ ద్రోసి రేఫయుతయతిని గణించుటే సమంజస మని నాయభిప్రాయము.

15. ఎక్కటియతి.

భీమన 'మయురలవ' లని, చిన్నకోటపెద్దన 'మరఱలవ' లని వ్రాసినారు. అనంతుఁడు 'మరఱళవ' లన్నాఁడు. పెద్ద నానంతులకు లళలందే భేదము. యకారమునకు అహలు చెల్లుటచే ననంతుఁడు దానిని వదలెను. అనంతోక్తమగు పై యక్షరములన్నియు నేకతరవళులు గావు గాని యనంతునియభిప్రాయ మిట్లుండు నని తోఁచెడి.

మూఁడు సాధారణహల్లు మిత్త్రంబు గానేరదు, బిందుపూర్వకపవర్గాంతస్థోష్మములే యతిమైత్త్రి నొందుచు గావున 'మా' ఎక్కటియతి యమ్యో రఱ లేకతరవళులే యగును.

ధర నెక్కటివ ళ్లితగు
శరమటువలు, వానిలోఁ జెలంగును లాక్షన్
సరిళాయన విశ్రమ వే
శ్రరమాధిప రెండునుం గలసి వర్తించున్. (118 పద్య)

లాకు సరియగుఁళాయనఁగా లళలు రెంటికి రూపాంతరము గల శబ్దములలోని లకార మని భావము. సంస్కృతమున లళల కభేదము, ళాంతములన్నియు లాంతములందే చేరును. వేళ (స్త్రీ) వేల; వేలాబ్ధి తీరాబ్ధివృద్ధ్యోః కాలమర్యాదయోరపి-నానార్థరత్నమాల. కాలమనుటకు వేళయనవలసి యున్నను లళల కభేదముచే నిట్లు వ్రాయఁబడియె. 'ళల లకు భేదము లే దనుపలుకున ళాదొలఁగి డైదుపదులగువర్ణంబులు సంస్కృతభాషకు' నని చతుర్థాశ్వాసమున ననంతుఁడు చెప్పినాఁడు. లళ లకభేదముగా నున్నవ్యాకరణమాత్రమే యీవిధి పాటింపఁబడు నను నభి ప్రాయము లేకున్న నిది యేకతర యతియందు గ్రహింపనేల? "కాకుస్వ రయతి యగు నితఁడే కదలక జలధిఁ బవ్వళించె-ననగ" (96 ప) అను చోటఁ బవ్వడించె నని పఠించిన ళడయతిశంక రాఁజాలదు.

మఱి 'వా' యన్ననో పైలకారమువంటిదే యగు నని భావిం చెదను.

ప్రకటసకారవకార, ద్వికములకుం జరు నభేదవిరతి నిశాట
ప్రకటమెఱిసె రాముని పావకశరముసజనకసుత నెపంబునననఁగన్. (126 ప)

నెపమునకు నెవము రూపాంతరము. వకారరూపాంతరము గలి గుటచే 'పా'కు 'వా'కు యతి చెల్లిన దని గ్రహింపవలయు. ఏతాదృశాభి ప్రాయం బుండకున్న నేకతరవళ్లిందుఁ జైనింబేర్కొన్నయక్కరములఁ జేర్చుట పొసఁగనేరదు. భీమన చెప్పిన 'యా'కు నచ్చపు 'హ'కారంబు మిత్రం బగుటచే ననంతుఁడు పీడియున్నాఁ డని యిందువలనఁ దేలు చున్నది కదా! సశేషము.

ఒక మనవి.

౧. మూలానుసారముగా నాంధ్రీకరింపఁబడిన యముద్రిత వాల్మీకిరామాయణములు కొన్నియటనట నున్నటులఁ దెలియవచ్చుచున్నది. తంజనగరమందలి సరస్వతీమహాలులో నట్టి రామాయణ మొకటి కట్టా వరదరాజకృతము చూపట్టుచున్నది. సామాన్యముగ మూలానుసారము లగు రామాయణాంధ్రానువాదములు కనుపట్టుట లేదు. కావున భాషాభిమాను లీరీతి యాంధ్రానువాదముల ముద్రించి ప్రకటించినచో దేశమునకు భాషకు మహోపకారమగునని భావించుచున్నాము.

౨. సవరణలు—

పరిషత్పత్రిక 32 వ సంపుటము ౧-౨ సంచికలోఁ బ్రకటితమైన శ్రీశ్రీ పీఠికాపురమహారాజావారి "తొలిపలుకు"లో కొలఁది ముద్రణప్రమాదము లేర్పడినవి. వాని నీక్రింద సవరించినరీతిని బఠింపవలయును.

పుట 63 "గర్జద్ఘూర్జరగర్వ" అను శ్లోకముక్రింద యాంధ్రానువాద మీరీతిగ సవరించుకొనునది.

ఓసింగభూపవరేణ్యా! గర్జించుఘూర్జరులగర్వములను పర్వతములను భేదించువాఁడవును, నేపాళరాజులను చీకట్లకు సూర్యుఁడవును, కటువుగా నందడించు సౌరాష్ట్రిలవలని యుపద్రవముల నడఁచివేయువాఁడవును గర్వించుచున్న కేరళరాజుల మౌళులను పిండిచేయువాఁడవును లోకములకు నభయమీయ దీక్ష పూనినవాఁడవునగు నీకు బహుశ్రేయస్సులు కలుగుఁగాక.

పుట, 67-వ పుటలో 3-వ పంక్తిలో-

	తప్పు.	ఒప్పు.
	సర్వజ్ఞులీక్రింది.	సర్వజ్ఞుఁడీక్రింది.
17.	పరోపకారసంపన్నులై.	పరోపకారసంపన్నుఁడై.
18.	శీలసంపన్నులై.	శీలసంపన్నుఁడై.

గ్రంథబహుమానము.

శ్రీపీఠికాపురసంస్థానాస్థాన విద్వాంసులును, శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటు సంపాదకులును, ఆంధ్రసాహిత్య పరిషదధ్యక్షులును, సాహిత్య విశారదులునగు బ్రహ్మశ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రులవారమూల్యములగు సంస్కృతాంధ్రగ్రంథముల 350 టిని ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తకభాండాగారమునకుఁ బసదనంబుగ నొసఁగిరి. వానిలో నమూల్యములగు సంస్కృతగ్రంథములు గలవు. ఆంధ్రగ్రంథములలోఁ గూడ నధునాతనములైనను నమూల్యములైనవి కలవు. శ్రీ శాస్త్రులవారి యభిప్రాయార్థము వచ్చినగ్రంథములు తాము స్వంతముగ నిలుపుకొనదగినవికూడ పరిషత్తున కొసంగుటచే పరిషత్తుపైనివారికిఁగల యవ్యాజ్యానురాగము పరిస్ఫుటమగుచున్నది. ఇట్టిగ్రంథము లొకప్రత్యేకవ్యక్తిగతము కాకుండ నేదేని సంస్థయందున్న వానియుపయోగ మినుమడించి, గ్రంథములు ప్రకాశమానములగునను మహోదారాశయముతో శ్రీ శాస్త్రులవారు పరిషత్భాండాగారమును తమ గ్రంథరత్నములచే నలంకరించుట యెంతయు ముదావహము.

ఇట్లు,

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యదర్శులు.

గ్రంథస్వీకారము.

1. మునిత్రయీచరిత్రము: సంస్కృతశబ్దవిద్యకు సంప్రదాయకర్తలగు మహర్షులు పాణిని కాత్యాయన పతంజలులు - వీరి యపూర్వచరిత్రములను మునిత్రయీచరిత్రమను పేర బ్రహ్మశ్రీ కవిభూషణ, విద్వాన్ వెంపరాల సూర్యనారాయణశాస్త్రులవారు నిర్వచనకావ్యముగఁ దెలుఁగున రచించిరి. ఈగ్రంథము శ్రీమన్మహా మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, వ్యాకరణసార్వభౌమ శాస్త్రరత్నాకర తాతా సుబ్బారాయశాస్త్రులవారి కంకితము-ఆంధ్రవిశ్వకళాపరిషత్పండితులగు బ్రహ్మశ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రులవారీగ్రంథమునకుఁ జక్కని పీఠిక వ్రాసిరి.

గ్రంథమున నాలుగాశ్వాసములును నెనిమిదివందల డెబ్బదియైదు పద్యములు గలవు. ప్రాచీన ప్రబంధరీతులును ప్రత్నసంప్రదాయధోరణియు నిందుఁ గన్పట్టుచున్నది- పీఠికలో గ్రంథకర్తఁగూర్చియు, కవిత్వముఁగూర్చియు విశేషముగ వ్రాయఁబడినది- మూల్యము రూపాయి మాత్రమే. వలయువారు రామచంద్రపురము స్థానికోన్నత పాఠశాలాంధ్రపండితులగు గ్రంథకర్తగారికి వ్రాసినఁ బడయఁగలరు-ని॥ వే॥

---

2. రేణుకవిజయము: ఆంధ్రదేశమున వీరశైవమత పునరుద్ధరణమునకు బహుమహాప్రకార్యములు దీక్షతో సాఁగించుచున్న శివశ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మగారు, తమ శివధర్మగ్రంథమాలలో పదియవ పుష్పముగ నీ రేణుకవిజయమును బ్రకటించియున్నారు శైవపంచాచార్యులలోఁ బ్రథముఁడును, ప్రసిద్ధుఁడును నగు నీ రేణుకాచార్యుని చరిత్రమును శిరోమణి సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు నిర్వచనముగ నైదాశ్వాసములు నెనిమిదివందల యొక్క పద్యమును రచించిరి- రేణుకపథపథికులగు శ్రీ వీరభద్రశర్మగారి దివ్యమగు ప్రసక్తి గ్రంథ మాంధ్రదేశము ప్రసక్తిఁ గలిగించుకొనుటకు దారిచూపినది. కవితారచనను గూర్చియు, కావ్యప్రశస్తినిఁగూర్చియు, కథనీయుఁడగు రేణుకాచార్యునిఁగూర్చియు విశేషములు పీఠికారూపమునన్న ప్రసక్తివలనఁ దెలియును గాన

గ్రంథము సికిందరాబాదు శ్రీ శివధర్మ గ్రంథమాలకు వ్రాసి తెప్పించి యందఱను జదువఁగోరుచున్నారము గ్రంథము ప్రశస్తముగు కాగితములపై ముద్రింపఁబడినది- వెల సులభము రూపాయిమాత్రమే. ని॥ వే॥

---

3. అమరుకమ్: శ్రీ వింజమూరి శివరామారావుగారు రచించినది. అమరుకుఁడను రాజశరీరమునఁ బరకాయప్రవేశవిద్యచేఁ బ్రవేశించియున్న శ్రీ శంకరభగవత్పాదులీ గ్రంథమును రచించియుండిరను కింవదంతి శ్రీ శంకరుల సర్వతోముఖపాండిత్యమును గొనియాడుటకు వ్యాపించినదై యుండవచ్చునని వ్యాఖ్యాతలయభిప్రాయము. అయినను నీగ్రంథకర్తకీ గాథ యిష్టము. కానుకొలను అన్నమరాజు తొలుదొల్త నీయమరుకమును బదునాఱవ శతాబ్దిలో ననువదించిన ట్లున్నది. ఇటీవలఁ గీర్తిశేషులు శ్రీ జయంతి రామయ్యపంతులుగారును మఱికొందఱును నీశతకము నాంధ్రీకరించి ప్రచురించినారు. పలువు రనువదించినదే యైనను దీనినే మఱల ననువదించుటకు వీరికి గ్రంథమునందలి యభిమానము కారణము. అనువాదమునఁ గొన్నిపట్టుల మూలములోని భావము మాత్రము గ్రహింపఁబడి కొంత స్వేచ్ఛ చూపఁబడినది. మచ్చునకొక పద్యము.

సుమశరుఁ డన్ననో విరహశోకము నొందెడువారి నొంది దే
హములు కృశింపఁ జేయు కఠినాత్ముఁడు; వాసరముల్గణించుదు
ష్టమతియముండు; నీవును రుషామయవశ్యుఁడవోయి నాథ! జీ
వములెటుదాల్తురో తలఁపవా నవపల్లవకోమలుల్ సతుల్. వే॥ రా॥

---

4. త్రయీమూర్తి: విద్వాన్ పాలెపు వేంకటరత్నముగారిచే రచింపఁబడినది. వివేకానందస్వామి దివ్యజీవితములోని రసవద్ఘట్టములు కవినాకర్షించి, జని, అంతర్వాణి, ప్రబోధనము, ఫలసిద్ధి మున్నగు శీర్షికలక్రింద వర్ణింపఁబడినవి. కావ్యమున నచ్చటచ్చట నాటకమునం బోలె

"నరేంద్రుఁడొంటిగాఁ దనగదిలో సోఫాపై గూర్చున్నాఁడు;" "నరేంద్రుఁ డేమియు బదులాడలేదు" మొదలగు రంగనిర్దేశములును, అభినయసూచనలును గ్రొత్తగాఁ గన్పించుచున్నవి. రామకృష్ణుని యాశ్రమారామవర్ణనలో సహజవైరము లుడిగిన సత్త్వములయు, తత్త్వవిచారణ మొనర్చు పక్షులయు వర్ణనములు సహజములే యయ్యును "బొందుపల్లియ కంచమున భార్యతోఁగూడి" అనుపద్యమునందలి భావముమాత్రము కొంచెము స్థలవిరుద్ధముగనున్నది. 'అస్త్రసిద్ధి'యను పాశుపతప్రాప్తి యీ గ్రంథమున కనుబంధముగాఁ జేర్పబడిన చక్కని ఖండకావ్యము. వే॥ రా॥

---

5. కుముద్వతీపరిణయము: ప్రబంధఫక్కిని ద్విభాషి. సోమనాథశాస్త్రిగారిచే రచింపఁబడిన నైదాశ్వాసములుగల కావ్యము. కృతిప్రశంస, షష్ఠ్యంతములు, పురవర్ణనాదికము, అలంకారసామగ్రి, ఆశ్వాసాంతపద్యములు వీనియన్నిటిలో నీగ్రంథము సర్వథాపూర్వకవుల ప్రకృతులకుఁ బ్రతికృతియై యలరారుచున్నది. వస్తువు రఘువంశాంతర్గతంబగు కుశమహారాజ చరిత్రము. అందందు గ్రంథకర్త తత్తద్రసోచితములగు వర్ణనలు మూలకథకుఁ జేర్చియున్నాఁడు. దీనికిఁ గవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు వ్రాసిన పీఠికగలదు. వీరనినట్లే గ్రంథవిలోకనికిఁ బ్రథమప్రయత్నమేయైనను బాలకుల కట్లుతోఁపక బహుగ్రంథనిర్మితియైన వెనుక వ్రాసిన గ్రంథమువలెనే తోఁచును. వే॥ రా॥

---

6. గీతామృతము: స్నేహలతా కవితాసంఘ పక్షమున శ్రీ వాజపేయయాజుల రామసుబ్బరాయుఁడుగారు రచించి ప్రకటించిన 47 పద్యముల చిన్నపుస్తకము. ఇందు గీతలలోని సారాంశభూతములగు కొన్ని శ్లోకములు తేటతెనుఁగున నెల్లరకు బఠించుట కవకాశముగలుగునట్లు వ్రాయఁబడినవి.

---

7. శ్రీ శారదాదేవి చరిత్ర, చిరంతనానందస్వామి విరచితము, శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు, చెన్నపురి. వెల. రు 1-4-0.

శ్రీ రామకృష్ణ పరమహంసకు సహధర్మచారిణియై తన యపూర్వజీవితముచే లోకమును బవిత్రమొనర్చి, భక్తిచే సైతము పరమేశ్వరిగా పూజింపఁబడిన మహనీయవ్యక్తియగు శ్రీ శారదాదేవి చరిత్ర యీగ్రంథమున సులభమగు నాంధ్రభాషయందు రచింపఁబడినది. గ్రంథకర్తలు పాఠకులకుఁ జిరపరిచితులై శ్రీ వివేకానందులచరిత్రము నిదివఱలో రచించియున్నారు. శ్రీ శారదాదేవి జీవితవిశేషములు, ఆమెప్రభావము, నిరాడంబరజీవితము, పారమార్థికచింత, సౌశీల్యాది సద్గుణములు, మొదలగు యమూల్యవిషయములు శ్రీ రామకృష్ణమఠము వారాంగ్లమునఁ బ్రకటించిన గ్రంథములనుండి గైకొనఁబడినవి. పురాణయుగమునకు భరతవాక్యమా ? నవీనయుగమునకు నాందియా యని శ్రీ సోదరి నివేదితవలనఁ బ్రశంసింపఁబడిన శ్రీశారదాదేవి పవిత్రచరిత్రమును దేశభాషలఁ బ్రకటించి శ్రీరామకృష్ణమఠము వారును, గ్రంథకర్తలును కృతకృత్యులైరని తెలుపుటకు సంతసింపుచున్నాము. వీ రింక నిట్టి గ్రంథములఁ బ్రకటించి దేశసేవ యొనర్తురుగాక.

---

8. Important Inscriptions from the Baroda State by A.Gadre. Price.5/7/- శ్రీ ప్రతాపసింహ మహారాజ రాజ్యాభిషేకగ్రంథమాలయందు రెండవ కుసుమముగ నిది ప్రకటింపఁబడినది. శ్రీ బరోడాసంస్థాన ప్రభువులు సంస్కృతగ్రంథావళి యందమూల్యమగు గ్రంథములను బ్రకటించుచుండుటయేగాక తమసంస్థానమునఁ బురాతన విజ్ఞాన (Archaeology) శాసన పరిశోధక సంఘముల నేర్పరచి యున్నారు. వీరిప్రయత్నములు సర్వదా ప్రశంసనీయములై యున్నవి. వీరి మార్గమున నితరప్రభువులును దమతమ రాజ్యములలోని శాసనాదికములను బ్రకటించినచో మనదేశమునకు మిక్కిలి యుపయోగకారిగనుండు

నని తెలుప నవసరము లేదు. ఈగ్రంథమున ముఖ్యమగు పండ్రెండు శాసనములు మూలము, వ్యాఖ్యానము ప్రతిబింబముతోడను ప్రకటింపఁబడి యున్నవి. ఇం దాఱు శాసనములు నూతనముగఁ బ్రకటింపఁబడినవి. శేషించినవి పూర్వప్రకటితము లైనను నూతనవిషయములతోఁ జేర్పఁబడి యున్నవి. ప్రాచీన శాసనములలో ముఖ్యమగునది మహాక్షత్రపుఁడగు ప్రథమ రుద్రసేనుని మూలవాసరశిలాశాసనము. సంస్కృతభాషలో బ్రాహ్మీలిపియందు రచింపబడినది. శకసంవత్సరము 122 నాఁటిది. ఈచిన్నశాసనము చాల ముఖ్యమైన దగుటచేతను, ప్రాచీనమగుటచేతను నిటఁ జూపుచున్నాము.

వనిజకస్య- (అడ్డముగా వ్రాయఁబడినభాగము.)
(నిలువుగ.)
రాజ్ఞో మహాక్షత్రపస్యస్వామి రుద్రసేనస్య
వర్షే 122 వైశాఖబహుల పంచమ్యామ్
ఇమాం శిలాలష్టి ఉత్థాపితా వనిజకస్యపుత్రేన
ప్రతిజీవితమ్ దత్తమ్ స్వమిత్రేహి నిజస్య.

తనమిత్రునికొఱకు స్వజీవితమును ధారవోసిన వణిజకుని కుమారుని జ్ఞాపకచిహ్నముగా నీశిలాశాసనము నెలకొలుపఁబడినది.

ఆఱవశతాబ్దము నాఁటి కటచ్చురి వంశీయుఁడగు తరళస్వామి తామ్రశాసనములోని ప్రథమభాగము దొరకినది. ఇది పూర్వప్రకటితమగు బరోడామ్యూజియమ్ వారి సంఖేడ శాసనమునకుఁ బూర్వభాగమని గుర్తింపఁబడినది. ఈశాసనము సంస్కృత సమాస జటిలమై యాఱవ శతాబ్దమునాఁటి సంస్కృత భాషారచనమును విశదీకరించుచున్నది. ఇట్టి శాసనములు ప్రకటించి భాషకును, దేశచరిత్రమునకును నమూల్యమగు విషయముల నమకూర్చిన శ్రీ బరోడాసంస్థానాధీశ్వరుల మన మభినందింపవలసియున్నది.

9. హంససందేశము-భాషాప్రవీణ శ్రీ పెనుమర్తి వేంకటేశ్వర శాస్త్రిగారి యనువాదము. ఇందు మూలమును శ్రీ శాస్త్రిగారి యనువాదమును బ్రకటింపఁబడినవి మూలగ్రంథకర్తయగు శ్రీ వేదాంత దేశికులనుగూర్చియు, హంససందేశ కావ్యములనుగూర్చియు పెక్కువిషయములు పీఠికయందు పీఠికాపుర కళాశాలోపాధ్యాయులగు శ్రీ శ్రీ ఉ. వి. వీరరాఘవాచార్యులుగారు చర్చించియున్నారు. వీరి పీఠికవలన హంససందేశమునకుఁగల యాంధ్రానువాదములు, హంససందేశకవులు వారి యితరగ్రంథములు శ్రీరామకథాశ్రయములగు దూతకావ్యప్రశంసావిషయములగు యమూల్యవిషయము లెన్నియో తెలియుచున్నవి. శ్రీ శాస్త్రిగారి యాంధ్రీకరణము మృదువగు శైలిలో రచింపఁబడి మూలభావముల వ్యక్తీకరించుచున్నది.

మచ్చునకొకపద్యము.

కూరిమినిట్టు లేఁగికనుఁగొందువు జన్నపు నేలదున్నుచో
సీరపుఁజాలు వెల్వడిన సీతను నీ చెలినోయి మిత్రమా
వారని ప్రేమనాకొరకె ప్రాణముమాని పతివ్రతాత్వమా
కారముఁగొన్నదో యనఁగ గాసిలుచున్న సతీమతల్లికన్.

---

10. శివపంచస్తవి: శ్రీ శివధర్మగ్రంథమాలయందు పదునొకొండవపుష్పము-ఇందు, శివపంచస్తవములనఁ బరగిన సంస్కృతస్తవములును, వాని యాంధ్రీకరణపద్యములును, దాతృప్రశంసయు, ప్రస్తుతమును, భక్తరంజనీ వ్యాఖ్యయు, ననుబంధమును, సాధుపత్రిమును, గ్రంథమాలాగ్రంథప్రకటనము గలవు మూఁడువందల నలుబది పుటలును, రెండు త్రివర్ణచిత్రములును మూఁడు ఛాయాప్రతిబింబములును గలవు. చక్కని తెల్లకాగితముపై స్ఫుటముగ ముద్రింపఁబడి గ్రంథము పసుపురంగు అట్టలతోఁగూడ సకలజనాకర్షణసమర్థమై విరాజిల్లుచున్నది- శివభక్తిప్రబోధము గావించుచున్నది. కాగితపు కఱవురోజులలోఁ గన్నులకఱవు దీర నిట్టి గ్రంథమును నింత చౌకవెలకు (ఒకరూపాయి పావులా మాత్రమే!) నాంధ్రదేశీయుల కందఁజేసిన పండిత శ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మగారికిని, శ్రీ దుంపల రామిరెడ్డిగారికి నాంధ్రులెల్లరునుఁ

కృతజ్ఞ తాబద్ధులు- శివభక్తిప్రబోధమునకును తోద్ధరణమునకు నీగ్రంథ మత్యంత సహాయకారికాఁగలదు.

గ్రంథమున స్తవములను భాషాంతరీకర్తల వివరణము నిటపొందు పఱుపఁబడినవి.

పేరు.	సంస్కృతకవి.	ఆంధ్రీకర్త.
1. మహిమ్నము-	పుష్పదంతుఁడు-	శ్రీ పన్నాల సీతారామ బ్రహ్మశాస్త్రి.
2. మల్హాణము-	మల్హాణుఁడు-	శ్రీ వడ్డాది సీతారామాంజనేయకవి
3. మలయరాజీయము-	మలయరాజు-	శ్రీ దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రులవారు.
4. అనామయము-	దండి-	శివశ్రీ బండారు తమ్మయ్య గారు.
5. హాలాయుధము-	హాలాయుధుఁడు-	శివశ్రీ పండిత చిదిరెమఠము వీరభద్రశర్మగారు
6. అనుబంధము-		శ్రీ శృంగారకవి కంకట రామయ్యగారు.
7. భిల్హణస్తవము-	భిల్హణుఁడు-	శ్రీ వింజమూరి లచ్చా రాయకవిగారు.
8. అనామయస్తవము-	దండి-	శ్రీ శృంగారకవి సర్వా రాయడుగారు.

ఈ పద్యానువాదములన్నియు హృద్యములై యొప్పుచున్నవి- పై వారిలో 1, 3, 7, 8 సంఖ్యగలవారు కీర్తిశేషులు.

వీని కన్నింటికిని భక్తరంజనీవ్యాఖ్యయు గ్రంథమునకుఁ బ్రస్తుతమును రచించిన శివశ్రీ పండిత వీరభద్రశర్మగారి శివశ్రుతి స్మృతి పురాణేతిహాసనిరుపమానపాండితీవైదగ్ధ్యము గణనాతీతము - లోకోత్తరము. ఆంధ్రదేశీయులెల్లరు నీ గ్రంథము నాదరింతురుగాక! ని. వే.